మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 1-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 272 Issue: 272

Published from Jagitial
Circulated to Telangana

01 ఏప్రిల్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:14 సూర్యాస్తమయం - సా. 6:25 తిథి చతుర్దశి ఉ. 7:06 వరకు తరువాత పౌర్ణమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం ఉత్తర ఫల్గుని(ఉత్తర) సా. 4:15 వరకు తరువాత హస్త యోగం వృద్ధి మ. 2:49 వరకు కరణం వనిజ ఉ. 7:06 వరకు విష్టి రా. 7:24 వరకు వర్జ్యం రా. 1:09 నుండి రా. 2:50 వరకు దుర్ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:44 వరకు రాహుకాలం మ. 12:20 నుండి మ. 1:51 వరకు యమగండం ఉ. 7:45 నుండి ఉ. 9:17 వరకు గుళికాకాలం ఉ. 10:48 నుండి మ. 12:20 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:38 నుండి తె. 5:26 వరకు అమృత ఘడియలు ఉ. 8:47 నుండి ఉ. 10:27 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## అమెరికా యుద్ధం ఖర్చు.. 2.63 లక్షల కోట్లు

### ఇరాన్‌తో యుద్ధానికి ఒక సెకనుకు 9.8 లక్షలు

### రోజుకు రూ.8,455 కోట్లు: సిప్రి నివేదిక

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో అమెరికా సెకనుకే రూ.9.8 లక్షలు ఖర్చు చేస్తోందట. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఈ యుద్ధం కోసం అమెరికా ప్రతి సెకనుకు 10,300 డాలర్లు ఖర్చు చేస్తోంది. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ యుద్ధం 31వ రోజుకు చేరుకోగా, ఇప్పటివరకు అమెరికా 27.68 బిలియన్ డాలర్లు (రూ.2.63 లక్షల కోట్లు) ఖర్చు చేసింది.

వాషింగ్టన్: అంటే.. రోజుకు సగటున 890 మిలియన్ డాలర్లు (సుమారు రూ.8,455 కోట్లు) వెచ్చిస్తోంది. ఈ ఖర్చులో ఆయుధాలు, వైమానిక, నౌకాదళ కార్యకలాపాలు, క్షిపణి రక్షణ వ్యవస్థలు, నిఘా, రవాణా ఉండగా, సింహభాగం, రోజుకు 320 మిలియన్ డాలర్లు (సుమారు రూ.3,040 కోట్లు), ఆయుధాలు, క్షిపణులకే వెళుతోంది. టోమహాక్ క్రూయిజ్ క్షిపణులు, జేడీఏఎం బాంబులు వంటి వాటి కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారు. వైమానిక కార్యకలాపాల కోసం రోజుకు 245 మిలియన్ డాలర్లు, నౌకాదళ కార్యకలాపాల కోసం 155 మిలియన్ డాలర్లు ఖర్చవుతున్నాయి. థాడ్, పేట్రియాట్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థల కోసం రోజుకు 95 మిలియన్ డాలర్లు, నిఘా, సైబర్ ఆపరేషన్ల కోసం 45 మిలియన్ తరువాయి 2 వ పేజీలో...



## 5.72 లక్షల మంది స్వదేశానికి!

### పశ్చిమాసియా సంక్షోభంతో భారత్‌కు ప్రవాసులు

### యూఏఈ నుంచి రోజు 85 విమానాల రాకపోకలు

### సురక్షితంగానే భారత నావికులు: కేంద్ర ప్రభుత్వం

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడి నుంచి భారతీయులను స్వదేశానికి తరలించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు సుమారు 5.72 లక్షల మంది ప్రయాణికులు పశ్చిమాసియా దేశాల నుంచి సురక్షితంగా భారత్‌కు తిరిగి వచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం వెల్లడించింది. ఖతార్ గగనతలం పాక్షికంగా తెరుచుకోవడంతో సుమారు 8 నుంచి 10 ప్రత్యేక వాణిజ్య విమానాలు భారత్‌కు వచ్చినట్లు తెలిసింది.

న్యూఢిల్లీ: విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం.. యూఏఈ నుంచి రోజుకు సుమారు 85 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఒమన్, సౌదీ అరేబియా నుంచి కూడా భారత్‌కు విమానాలు నడుస్తున్నాయి. అయితే, కువైట్, బహ్రెయిన్ గగనతలాలు ఇంకా మూసివేసే ఉండటంతో ఆ మార్గాల్లో సర్వీసులు నిలిచిపోయాయి. సౌదీ అరేబియాలోని దమ్మామ్ విమానాశ్రయం నుంచి మాత్రం భారత్‌లోని వివిధ నగరాలకు ప్రత్యేక విమానాలు నడుస్తున్నాయి. పలు దేశాల్లో గగనతలాలు మూసివేయడంతో భారతీయుల ప్రయాణానికి ప్రత్యామ్నాయ మార్గాలను సులభతరం తరువాయి 2 వ పేజీలో...

# మాకు చీకట్లు.. మీకు వెలుగులా?

### పంటలు ఎండుతుంటే విద్యుత్తు ఉత్పత్తా?

### శ్రీశైలంలో మా నీళ్లు దోచుకుంటే ఊరుకోం

### చదువురాని వాళ్లా? జీవోలు చదువుకోలేరా?

### ఏపీ ప్రభుత్వంపై మంత్రి జూపల్లి నిప్పులు



హైదరాబాద్, మార్చి 31 (ఈవార్తలు): శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకున్నా.. ఏపీ ప్రభుత్వం అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. తెలంగాణ నీళ్లు దోచుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మట్లాడిన ఆయన.. ఏపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. చంద్రబాబు సర్కార్ బరితెగించి నీటిని దోచుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు తరువాయి 2 వ పేజీలో...



## తెలంగాణకు రూ.248 కోట్లు

### పల్లెలకు కేంద్రం నిధులు విడుదల

### పలు రాష్ట్రాలకు 1500 కోట్లు రిలీజ్

న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 31 (ఈవార్తలు:): గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక పాలనను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు తెలంగాణ, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, మిజోరం, మేఘాలయ రాష్ట్రాలకు రూ. 1,500 కోట్లకు పైగా నిధులను మంగళవారం విడుదల చేసింది. పంచాయతీతరువాయి 2 వ పేజీలో...



## పితృత్వ సెలవులు ఇవ్వాల్సిందే!

### ప్రసవానంతరం భార్యకు భర్త అండ ఉండాలి

### ఇదేం విలాసం కాదు.. సంరక్షణ బాధ్యత

### కేంద్రానికి ఎంపీ రాఘవ్ చద్దా డిమాండ్

పితృత్వ సెలవును అన్ని రంగాల్లో చట్టబద్ధమైన హక్కుగా మార్చాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. బిడ్డ సంరక్షణ బాధ్యత కేవలం తల్లులకే పరిమితం కాదని, అది తల్లిదండ్రులిద్దరి ఉమ్మడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. 'బిడ్డ పుట్టినప్పుడు తల్లిదండ్రులిద్దరికీ శుభాకాంక్షలు వెల్లువెత్తుతాయి, కానీ సంరక్షణ బాధ్యత మాత్రం చట్టపరంగా తల్లిపైనే పడుతోంది.

న్యూఢిల్లీ: ఇది చట్టం బలవంతంగా రుద్దుతున్న సామాజిక వైఫల్యం' అని వ్యాఖ్యానించారు. ప్రసవానంతరం ఒక మహిళకు శారీరకంగా, మానసికంగా, భావోద్వేగపరంగా భర్త అండ ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఆ సమయంలో భర్త తోడు విలాసం కోసం కాదు, అత్యవసరం. భార్య పట్ల భర్తకు ఉండే సంరక్షణ బాధ్యత కూడా అంతే ముఖ్యం అని సభకు వివరించారు. ప్రస్తుతం దేశంలో కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే 15 రోజుల పితృత్వ సెలవు లభిస్తోందని, ప్రైవేట్ రంగంలో అలాంటి నిబంధన ఏదీ లేదని చద్దా గుర్తుచేశారు. దేశంలోని 90 శాతం మంది ఉద్యోగులు ప్రైవేట్ రంగంలోనే ఉన్నారని, దీనివల్ల అత్యధిక మంది తండ్రులు ఈ సౌకర్యానికి దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వీడన్, ఐస్‌లాండ్, జపాన్ వంటి దేశాలు 90 రోజుల తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,951 |
| వెండి (గ్రాము): | రూ.250 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,766 |

## ఆట వస్తువులా అసెంబ్లీ

### ఇష్టమొచ్చినట్లు వాయిదాలు

### ప్రజా సమస్యలపై చిన్నచూపు

### అసెంబ్లీ సమయం వృథా

### ప్రభుత్వంపై హరీశ్ మండిపాటు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలసీలను గాలికి వదిలేసి, పహిల్వాన్ల భాషను మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. అసెంబ్లీలో పాలసీలు ఉంటాయి కానీ పహిల్వాన్లు, కుస్తీ పోటీలు ఉండవని ఎద్దేవా చేశారు. అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారని మండిపడ్డారు.

హైదరాబాద్, మార్చి 31 (ఈవార్తలు): కత్తులతో కోలాటంలో తలలు తీసేస్తామని మరో ఎమ్మెల్యే వ్యాఖ్యానించారని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని కోరారు. గడిచిన రెండున్నర సంవత్సరాలలో రేవంత్ రెడ్డి సభలో మాట్లాడిన ఎన్నో అనాగరిక వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వం తరువాయి 2 వ పేజీలో...

## సారా.. తాగుదాం!


### ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి 52 మంది ఎమ్మెల్యేల మద్దతు

### సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో సంతకాలు



ఇప్పపువ్వు సారా చెట్ల ఉద్యమానికి భారీగా స్పందన లభిస్తోంది. రాష్ట్రంలో 10 లక్షల ఇప్ప చెట్లు నాటేలా చర్యలు తీసుకోవాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన లేఖకు మద్దతుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మద్దతుగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు 52 మంది ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు.

హైదరాబాద్, మార్చి 31 (ఈవార్తలు): సీఎంకు రాసిన ఈ లేఖలో రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక-ఆర్థిక ప్రయోజనాల కోసం పెద్ద ఎత్తున ఇప్ప చెట్లను నాటాలని అనిరుధ్ రెడ్డి ఈ లేఖ ద్వారా కోరారు. రాష్ట్రంలో అనుకూల కలిగిన ప్రాంతాలలో 10 లక్షల ఇప్ప చెట్లనుతరువాయి 2 వ పేజీలో...



## అమెరికాకు ఇటలీ షాక్


### యుద్ధ విమానాలకు ఓ ఎంట్రీ

### ప్రధాని జార్జియా మెలోని నిర్ణయం


ఇరాన్‌పై యుద్ధంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పెద్ద షాక్ తగిలింది. ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న అమెరికా యుద్ధ విమానాలకు తమ గగనతలంలో అనుమతి ఇవ్వబోమని కొన్ని దేశాలు స్పష్టంగా ప్రకటించాయి.

రోమ్: తాజాగా ఆ జాబితాలో ఇటలీ కూడా చేరింది. అమెరికా యుద్ధ విమానాలకు గగనతలాన్ని మూసివేయ డానికి ఇటలీ ప్రధాని జార్జియా మెలోని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



వయాగ్రా అంగస్తంభనకే కాదు.. అల్జీమర్స్ వ్యాధిని నయం చేసే ఔషధంగానూ పనిచేస్తుందని తాజా అధ్యయనంలో తేలింది. సిల్డెనాఫిల్ తీసుకున్నవారిలో అల్జీమర్స్ చాలా మటుకు తగ్గిందని అమెరికాలోని క్లేవెల్యాండ్ క్లినిక్ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.



## టెక్ తాట తీస్తాం

### యాపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్‌పై దాడి చేస్తాం


### అమెరికా కంపెనీలకు ఇరాన్ హెచ్చరికలు

టెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) సంచలన ప్రకటన చేసింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా మైక్రోసాఫ్ట్, యాపిల్, గూగుల్, ఇంటెల్, బోయింగ్ లాంటి దిగ్గజ టెక్ కంపెనీలను చట్టబద్ధమైన లక్ష్యాలుగా పరిగణించి దాడులు చేస్తామని తీవ్ర స్థాయిలో హెచ్చరించింది. అమెరికాకు చెందిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థలు ఇరాన్‌లో హత్యలకు కుట్ర తరువాయి 2 వ పేజీలో...

## ట్రంప్.. మేం వెయిటింగ్!

### దగ్గరికి రా.. తేల్చుకుందాం.. ఇరాన్ కమాండోలు సవాల్

పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రతరమవుతోన్న వేళ ఇరాన్ సైన్యం సంచలన వీడియోను రిలీజ్ చేసింది. ఇరాన్ టెలివిజన్ ప్రెస్ టీవీ ప్రసారం చేసిన 59 సెకన్ల నిడివి కలిగిన ఈ వీడియోలో.. అమెరికా సైన్యాలతో ఢీకొట్టి, ఓడించేందుకు తమ కమాండోలు సిద్ధంగా ఉన్నారని టెహ్రాన్ హెచ్చరించింది. ఇరాన్ సైనికులు పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధంగా ఉన్నారనేది ఈ వీడియో ద్వారా స్పష్టం చేసింది. బ్యాక్ గ్రౌండ్‌లో మ్యూజిక్‌తో ఇరాన్ ప్రత్యేక దళాల విన్యాసాలు చేస్తుండటం వీడియోలో కనిపిస్తోంది. 'దగ్గరకు రండి.. తేల్చుకుందాం.. మేము మీకోసమే ఎదురుచూస్తున్నాం' అనే సందేశంతో అమెరికాకు సవాల్ విసిరింది.



టెహ్రాన్: రెండు రోజుల కిందట ఇరాన్ ఆంగ్ల పత్రిక టెహ్రాన్ టైమ్స్ సైతం 'నరకానికి స్వాగతం' అనే శీర్షికతో అమెరికా సైనికులను హెచ్చరిస్తూ కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. పూర్తి సైనిక సన్నద్ధతతో ఉన్న సైనికులు యుద్ధ విన్యాసాలు, కఠినమైన భూభాగం గుండా దళాలు ముందుకు సాగడం వీడియోలో కనిపిస్తుంది. మరో క్లిప్‌లో, ఇరాన్ సైన్యానికి చెందిన ఒక భారీ క్షిపణి ప్రయోగ వాహనం తన ఆయుధాన్ని పేల్చడం, ఆ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

1.4.2026

మేషం: వ్యాపారాలలో స్వంత ఆలోచనలు అంతగా కలసిరావు. ధన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ కలిగిస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఆప్తులతో మాట పట్టింపులుంటాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు కలుగుతాయి. విద్యార్థులు మరింత కష్టపడాలి. నిరుద్యోగుల ప్రయత్నాలు వృధాగా మిగులుతాయి.

వృషభం: రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. సోదర వర్గం నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ఉద్యోగాలలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి అధికారుల మన్ననలు పొందుతారు.

మిధునం: పాత ఋణ ఒత్తిడి నుండి బయట పడటానికి నూతన ఋణాలు చెయ్యాల్సి వస్తుంది. చిన్న నాటి మిత్రులతో మాటపట్టింపులుంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఇంటా బయట చికాకులు అధికమౌతాయి. వృత్తి వ్యాపారాలలో ఫలితాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగమున ప్రతికూల వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: సమాజంలో ప్రముఖులతో పరిచయాలు లాభిస్తాయి. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. కొన్ని వ్యవహారాలలో ధైర్యంగా ముందుకు సాగుతారు. ఆర్థికంగా కొంత మెరుగైన పరిస్థితి ఉంటుంది. వ్యాపారాలు విస్తరణ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులు అప్పగించిన విధులు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

సింహం: ఆదాయం కన్నా ఖర్చు అధికమౌతుంది. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఉదర సంబంధ అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. వ్యాపారాలలో నూతన సమస్యలతో జాగ్రత్త అవసరం. వృత్తి ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

కన్య: సంఘంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు పొందుతారు. ఆర్థిక లాభం కలుగుతుంది. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. సంతాన ఉద్యోగ వివాహ ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తాయి. అన్ని విషయాలలో బంధు మిత్రుల సహాయం అందుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం ఉంది.

తుల: ఉద్యోగమున అధికారులతో సమస్యలు పరిష్కరించుకుంటారు. వ్యాపార వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. శ్రమకు తగిన ఫలితం పొందుతారు. వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలతో చెయ్యడం మంచిది. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. బంధువులలో స్వల్ప వివాదాలు ఉంటాయి.

వృశ్చికం: చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోతాయి. ఇతరుల ప్రవర్తన వలన మానసిక అశాంతి కలుగుతుంది. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

ధనస్సు: సంతాన విద్యా విషయాలు సమస్యాత్మకంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు మరింత అధికమౌతాయి. ఖర్చులను అదుపు చెయ్యడం కష్టంగా ఉంటుంది. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్ర సందర్శనం చేసుకుంటారు. ప్రభుత్వ వ్యవహారాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి. అవసరానికి సన్నిహితుల సహాయ సహకారాలు అందుతాయి. సంతాన విద్యా విషయాలు సంతృప్తినిస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. ఉద్యోగమున ఉన్నత పదవులు పొందుతారు.

కుంభం: వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆదాయం విషయంలో లోటుపాట్లు అధిగమిస్తారు. వ్యాపారములలో శత్రు సమస్యలు నుండి బయటపడతారు. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. ఆర్థికంగా పురోగతి సాధిస్తారు.

మీనం: నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. కుటుంబ సభ్యులతో సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. అన్ని వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. ఉద్యోగమున అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్తవహించాలి.

# ఆట వస్తువులా అసెంబ్లీ



**మొదటి పేజీ తరువాయి**

వైఫల్యాలను నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. అసెంబ్లీని కూడా ఈ ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు నడుపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీ బ్రేక్ పేరుతో, రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారని, ముఖ్యమంత్రి కేరళ నుంచి వస్తున్నారని, ఆర్థిక మంత్రి ప్రిపేర్ అవుతున్నారని, లంచ్ బ్రేక్ అంటూ ఇలా వివిధ కారణాలతో సభను గంటల పాటు వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృధా చేశారని మండిపడ్డారు. కావాలని సభను రాత్రి వరకు నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ఎన్నికల కోసం శాసనసభను 30వ తేదీనే నిరవధిక వాయిదా వేశారని ఆరోపించారు. కేరళ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అవసరమేమో కానీ తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ శాసనసభ్యులకు ప్రజా సమస్యలు ముఖ్యమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు పెద్దగా తేడా లేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయని అన్నారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లాంటి వారు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారని గుర్తు చేశారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పిందని వెల్లడించారు. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వస్తున్నాయని తెలిపారు. సీఆర్ పాటిల్ తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని అడిగితే సమాధానం వస్తుందని అన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రూ.50 కోట్లు ఖర్చు చేస్తే మరో 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని రెండేళ్ల నుంచి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ స్పందించడం లేదని ఆరోపించారు. మా మీద కోపం ఉంటే తీర్చుకోవచ్చు... కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపించవద్దన్నారు.

# మాకు చీకట్లు.. మీకు వెలుగులా

**మొదటి పేజీ తరువాయి**

ఎండిపోతుంటే.. ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకుండా విద్యుత్ ఉత్పత్తి పేరిట నీటిని తరలించడం అన్యాయమని ఫైరయ్యారు. జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కూడా ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయారని.. తాము ధర్నాకు దిగే వరకు ఆ దోపిడీ ఆగలేదని మంత్రి జూపల్లి విమర్శించారు. నాడు ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించగా.. అక్రమ నీటి తరలింపును ఆపాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే పంథాను అనుసరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

శ్రీశైలం నీటిలో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని.. దక్షిణ తెలంగాణ రైతాంగం హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని జూపల్లి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 'మీరేమైనా చదువురాని వాళ్లా? జీవోలు స్పష్టంగా ఉన్నాక ఇంకా సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏముంది?' అంటూ ఏపీ అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంటే.. ఏపీ ప్రభుత్వం మాత్రం చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తోందని ఫైరయ్యారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలంలో నీటి దోపిడీని పట్టించుకోకపోవటం వల్లే ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని విమర్శించారు. ఏపీ ప్రభుత్వం తన అక్రమాలను తక్షణమే నిలిపివేయాలని లేదంటే తెలంగాణ ప్రభుత్వం, రైతులు, కాంగ్రెస్ పార్టీ సమిష్టిగా పోరాటం చేస్తామని జూపల్లి హెచ్చరించారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదని.. ఈ క్రమంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. తమ నీటి వాటాను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఏపీ ప్రభుత్వానికి తేల్చి చెప్పారు. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని లేదంట తీవ్ర పరిణామాలు ఉంటాయని మంత్రి జూపల్లి కృష్ణారావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

# సారా.. తాగుదాం!




**మొదటి పేజీ తరువాయి**

నాటేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రతిపాదిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్ప చెట్లు కరువును తట్టుకోగలవని తెలంగాణ వంటి అర్ధ-శుష్క ప్రాంతాలకు ఇవి ఎంతో అనుకూలమైనవి పేర్కొన్నారు. ఇవి నేల సారవంతాన్ని పెంచడమే కాకుండా, భూక్షయాన్ని అరికట్టి పచ్చదనాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు. ఇప్ప పువ్వులు, గింజలు ఆదాయానికి మంచి వనరులని, గిరిజనులు, గ్రామీణ ప్రజలు వీటిని ఆహారం, ఔషధాలు, జీవనోపాధి కోసం సంప్రదాయకంగా వినియోగిస్తారుని తెలిపారు. పోషకాలు సమృద్ధిగా ఉండి ఔషధ గుణాలు స్థానిక ఆరోగ్య సంరక్షణకు ఎంతో మేలు చేసే ఈ ఇప్ప పువ్వు చెట్లను విరివిగా పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పవన్ కల్యాణ్ గుడుంబా తాగితే తప్పు లేదా?

ఒక రాజకీయ నాయకుడిగా నేను సారా అంటే మాత్రం అందరూ ట్రోల్స్ చేస్తరు. సినిమా యాక్టర్లు వాళ్లు గ్లాసులు పట్టుకుంటే హీరోలు.. మరి రాజకీయ నాయకుడిగా గ్లాసులు పట్టుకుంటే మేం జీరోనా..? మేం తాగమని చెప్తున్నమా.. మీరే కదా సినిమాలల్లా డ్రింక్స్ పట్టుకొని తాగుతరని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వాపోయారు. మీడియా సమావేశంలో అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. మొన్న ఖుషీ సినిమా చూసిన. దాంట్లో అలీ, పవన్ కల్యాణ్ ఉంటరు. అలీ ఇంతింత ప్యాకెట్లు పెట్టుకుని తెలంగాణలోని ధూల్ పేట్ నుంచి తెచ్చిన అని చెప్పి ధూల్ పేటోళ్లని చిన్నచూపు చూపిచ్చినరు. అక్కడ ప్యాకెట్లు దొరికినయని చూపించినరు. పవన్ కల్యాణ్ తాగుకుంట తొక్కు నాకుతడు. మళ్ల ఇదేం కల్చర్. నేను పవన్ కల్యాణ్ గురించి నెగెటివ్ చెప్తలేను. సినిమాను సినిమాలాగా చూడాలే. కానీ యూత్ ఏం చూస్తరు. మా యాక్టర్ గుడుంబా తాగుతడు. అదెక్కడ దొరుకుతది ధూల్ పేట్ పోతమంటరు. అదైతే కరెక్ట్.. ఒకవేళ రాజకీయ నాయకుడిగా నేను సారా అంటే మాత్రం.. నేనేం తాగమని చెప్తలేను. ఇప్పటికీ చెప్తున్నా తాగొద్దంటున్నాను. పవన్ కళ్యాణ్ ఖుషీ సినిమాలో గుడుంబా తాగితే తప్పు కాదు కానీ.. నేను సారా అంటే మాత్రం తప్పొచ్చిందా..? అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వాపోయారు. బాలకృష్ణ మామ ఏక్ పెగ్ లా అంటే పబ్బుల్లో మూడు పెగ్గులు తాగుతరు. మరి అది సెన్సార్‌బోర్డు ఇవన్నీ బ్యాన్ చేయాలి కదా.. అసలు సినిమాలల్లా డ్రింక్స్ తాగేదే చూపియొద్దు. మందుబాబులం అంటే యువకులు డీజేలు పెట్టుకొని డ్యాన్సులు చేస్తున్నారు. అంటే సినిమా యాక్టర్లు వాళ్ల తాగుతేనేమో కరెక్ట్ మేం మా జీవితమంతా మా పిల్లలతో కూడా గడపలేం. వాళు సినిమాలు తీస్తే వాళ్లకు రెవెన్యూ వస్తది. మేం జనాల్లోకి పోయి మా పిల్లల పేరెంట్ టీచర్స్ మీటింగ్ ఉంటే కూడా పోలేకపోతున్నమని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు.

## ట్రంప్.. మేం వెయిటింగ్!

**మొదటి పేజీ తరువాయి**

తర్వాత పేలుళ్లు సంభవించడం కనిపిస్తుంది. క్షిపణి ప్రయోగాలు, డ్రోన్లు, యుద్ధ విన్యాసాలతో కూడిన దృశ్యాలు అమెరికా, ఇరాన్ మధ్య నెలకున్న ఉద్రిక్తతలను మరింత పెంచేలా ఉన్నాయి. యుద్ధాన్ని ముగించడానికి టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. పశ్చిమాసియాలో అదనపు దళాలను మోహరించడం అనేది ఆ ప్రాంతంలో కొనసాగుతున్న ఘర్షణలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు పలు ఆప్షన్లను అందిస్తుందని వైట్‌హౌస్ సోమవారం తెలిపింది. ఆ ప్రాంతంలో అదనపు అమెరికా దళాల మోహరింపు గురించి మీడియా అడిగిన ప్రశ్నకు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పందిస్తూ... "యుద్ధం తీవ్రంగా కొనసాగుతున్నందున, వ్యూహాత్మక సౌలభ్యాన్ని కొనసాగించే ప్రయత్నాలలో భాగంగానే ఈ మోహరింపులు ఉన్నాయి. దీనిని ముగించి ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి దౌత్య మార్గాలు తెరవెనుక పనిచేస్తున్నాయి" అని ఆమె సమాధానం ఇచ్చారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ లక్ష్యాలను సాధించడంపైనే అధ్యక్షుడు ఫోకస్ చేశారని, కమాండర్ ఇన్ చీఫ్ (ట్రంప్)కు అవసరమైన అన్ని మార్గాలను సిద్ధం చేయడమే పెంటగాన్ బాధ్యత అని ఆమె తెలిపారు. ఇరాన్‌తో పలు వారాల పాటు భూతల యుద్ధం కొనసాగించే ప్రణాళికలను పెంటగాన్ సిద్ధం చేస్తోందని వాషింగ్టన్ పోస్ట్ నివేదిక నేపథ్యంలో వైట్‌హౌస్ నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ఇది పూర్తిస్థాయి భూతల పోరు కానప్పటికీ స్పెషల్ ఫోర్సెస్, ఇన్‌ఫాంట్రీ దళాలతో లక్షిత దాడులు కొద్దివారాలు నిర్వహించే అవకాశం ఉందని, ముఖ్యంగా ఖర్గ్ ద్వీపం, హర్మూజ్ జల సంధి సమీపంలోని తీర ప్రాంతాలపై దాడులు జరగొచ్చిన సమాచారం.

## తెలంగాణకు రూ.248 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**

రాజ్ సంస్థలు, గ్రామీణ స్థానిక సంస్థలను ఆర్థికంగా శక్తిమంతం చేయడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడమే ఈ నిధుల విడుదల ముఖ్య ఉద్దేశమని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి విడత 'అన్-టైడ్ గ్రాంట్' కింద రూ. 247.94 కోట్లను కేంద్రం విడుదల చేసింది. ఈ నిధులు రాష్ట్రంలోని 12,600 గ్రామ పంచాయతీలకు చేరనున్నాయి. అన్-టైడ్ నిధులు కావడం వల్ల స్థానిక అవసరాలను బట్టి ఏ అభివృద్ధి పనులకైనా గ్రామ పంచాయతీలు ఈ నిధులను స్వేచ్ఛగా వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది. ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, రాజస్థాన్‌కు రెండో విడత అన్-టైడ్ గ్రాంట్‌గా రూ. 315.61 కోట్లు కేటాయించారు. ఉత్తరాఖండ్‌కు రెండో విడతగా రూ. 91.31 కోట్లు మంజూరు చేశారు. వీటితో పాటు గతంలో వివిధ కారణాలతో నిలిచిపోయిన నిధులను కూడా కేంద్రం ఇప్పుడు విడుదల చేసింది. మహారాష్ట్రకు గత ఆర్థిక సంవత్సరాలకు (2024-25, 2025-26) సంబంధించి నిలిచిపోయిన టైడ్, అన్-టైడ్ గ్రాంట్ల కింద వందల కోట్ల రూపాయలను విడుదల చేశారు. మేఘాలయకు 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెండో విడత అన్-టైడ్ గ్రాంట్‌తో పాటు టైడ్ గ్రాంట్లను కూడా కేంద్రం విడుదల చేసింది. 'టైడ్ గ్రాంట్ల'ను తాగునీరు, పారిశుద్ధ్యం వంటి నిర్దిష్ట పనులకు మాత్రమే ఉపయోగించాల్సి ఉండగా, 'అన్-టైడ్ గ్రాంట్లను' స్థానిక ప్రజాప్రతినిధుల నిర్ణయం మేరకు ఇతర అభివృద్ధి పనులకు ఖర్చు చేయవచ్చు. ఈ నిధుల విడుదలతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని కేంద్రం పేర్కొంది.

## అమెరికా యుద్ధం ఖర్చు.. 2.63 లక్షల కోట్లు

**మొదటి పేజీ తరువాయి**

డాలర్లు ఖర్చు చేస్తోంది. యుద్ధం మరింత ఉధృతం అవుతుండటంతో ఈ ఖర్చు మరింత భారీగా పెరిగే అవకాశాలున్నాయని నివేదిక తెలిపింది. కాగా, భారీగా ఖర్చు పెరుగుతుండటంతో యుద్ధ భారాన్ని గల్ఫ్ దేశాలపై మోపాలని ట్రంప్ ఆలోచిస్తున్నట్లు వైట్‌హౌస్ సంకేతాలు ఇచ్చింది. 1990 గల్ఫ్ యుద్ధ సమయంలో అరబ్ దేశాలు అమెరికాకు ఆర్థికంగా సహకరించిన విషయాన్ని గుర్తుచేయగా, వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ స్పందిస్తూ.. 'అధ్యక్షుడు ట్రంప్ కూడా దీనిపై ఆసక్తిగా ఉన్నారని నేను భావిస్తున్నాను. ఈ విషయంపై త్వరలోనే ఆయన నుంచి ప్రకటన వెలువడవచ్చు' అని తెలిపారు. అయితే, గల్ఫ్ యుద్ధం సమయంలో మిత్రదేశాలు కలిసికట్టుగా ఉండగా, ఈసారి అమెరికా, ఇజ్రాయెల్ ఏకపక్షంగా ఇరాన్‌పై దాడికి దిగాయి. మరోవైపు యుద్ధ నష్టపరిహారం చెల్లించిన తర్వాతే చర్చలకు వస్తామని ఇరాన్ స్పష్టం చేస్తోంది. ప్రతీకారంగా పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తోంది.

## 5.72 లక్షల మంది స్వదేశానికి!

**మొదటి పేజీ తరువాయి**

చేస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ఇరాన్ గగనతలం మూసివేత కారణంగా ప్రయాణికులను ఆర్మేనియా, అజర్‌బైజాన్ మీదుగా తరలిస్తున్నారు. అలాగే, ఇజ్రాయెల్‌లో ఆంక్షల దృష్ట్యా ఈజిప్ట్, జోర్డాన్ ద్వారా.. ఇరాక్ గగనతలం మూసివేతతో జోర్డాన్, సౌదీ అరేబియా ద్వారా భారతీయుల ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడి భారతీయ సమాజంతో అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, వారి భద్రతకు అవసరమైన సహాయం, సూచనలు అందిస్తున్నట్లు వివరించింది. మరోవైపు సముద్ర జలాల్లోని భారత నావికులందరూ సురక్షితంగా ఉన్నారని పోర్ట్స్, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. గత 24 గంటల్లో భారత పతాక నౌకలపై ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని తెలిపింది. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 18 భారత నౌకల్లో 485 మంది సిబ్బంది ఉన్నారని, వీరిని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీ షిప్పింగ్) నిశితంగా పర్యవేక్షిస్తోందని పేర్కొంది. కాగా, ఇప్పటివరకు 959 మంది భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి రప్పించగా, గత 24 గంటల్లో 9 మంది తిరిగి వచ్చారు. భారత్‌లోని అన్ని ప్రధాన పోర్టుల కార్యకలాపాలు సాధారణంగా, ఎటువంటి రద్దీ లేకుండా కొనసాగుతున్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పితృత్వ సెలవులు ఇవ్వాల్సిందే!

**మొదటి పేజీ తరువాయి**

నుంచి 52 వారాల వరకు పితృత్వ సెలవులు కల్పిస్తున్నాయని ఉదహరించారు. బిడ్డ సంరక్షణ, ఉద్యోగం రెండింటి మధ్య తండ్రి దేన్ని ఎంచుకోవాలన్న పరిస్థితి రాకూడదని, అదే సమయంలో భర్త మద్దతు లేకుండా తల్లి ప్రసవ వేదనను ఎదుర్కోకూడదని అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని, పితృత్వ సెలవును చట్టబద్ధమైన హక్కుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

## అమెరికాకు ఇటలీ షాక్

**మొదటి పేజీ తరువాయి**

అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై యుద్ధంలో తనకు సహకరించని దేశాలపై ట్రంప్ అక్కసు వెళ్లగక్కుతూ తన ట్రూత్ సోషల్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో ఇరాన్‌ను విచ్ఛిన్నం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలకు సహకరించని దేశాలు తమకు కావాల్సిన చమురు అమెరికా నుంచి కొనుగోలు చేయాలి. లేదా హర్మూజ్ జలసంధి ద్వారా వెళ్లి మీకు కావాల్సి వెళ్లి స్వయంగా తెచ్చుకోవాల్సిందే'అని వ్యాఖ్యానించారు.

## టెక్ తాట తీస్తాం

**మొదటి పేజీ తరువాయి**

పన్నడంలో, దాడులను అమలు చేయడంలో వ్యూహాత్మక పాత్ర పోషిస్తున్నాయని ఐఆర్జీసీ ఒక ప్రకటనలో ఆరోపించింది. ఇరాన్ గడ్డపై జరిగే ప్రతి ఉగ్రవాద చర్యకు బదులుగా ఈ టెక్ కంపెనీల స్థావరాలపై కచ్చితంగా విరుచుకుపడతామని ఇరాన్ అధికారిక మీడియా ప్రెస్ టీవీ నివేదించింది. ఏప్రిల్ 1 బుధవారం రాత్రి 8 గంటల నుంచి (టెహ్రాన్ కాలమానం ప్రకారం) తమ ప్రతీకార ఆపరేషన్లు మొదలవుతాయని ఐఆర్జీసీ స్పష్టం చేస్తూ అగ్రరాజ్యానికి సవాల్ విసిరింది. దాడుల నేపథ్యంలో సదరు టెక్ కంపెనీల కార్యాలయాలకు కిలోమీటరు పరిధిలో ఉన్న ఉద్యోగులు, స్థానికులు తక్షణమే ఆ ప్రాంతాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఐఆర్జీసీ సూచించింది. ఈ హెచ్చరికలను గ్లోబల్ సాంకేతిక సంస్థలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా నేరుగా అమెరికా ఆర్థిక వ్యవస్థను, సైబర్ ఆధిపత్యాన్ని దెబ్బతీయాలన్నది ఇరాన్ తాజా వ్యూహంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇవి గుర్తుంచుకోండి..!

### నేటి నుంచి వచ్చే ఆర్థిక మార్పులివే




**ఆదాయపు పన్ను చట్టం 2025 అమలు:**
దశాబ్దాల నాటి పన్ను నిబంధనలను సులభతరం చేసే లక్ష్యంతో కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025ను అమలు చేస్తోంది. ఈ కొత్త చట్టంలో అనేక అనవసరమైన సెక్షన్లను తొలగించి మరికొన్నింటిని పన్నుచెల్లింపుదారులకు అర్థమయ్యేలా అందుబాటులోకి తెచ్చింది.

**ఇకపై టాక్స్ ఇయర్:**
ఆర్థిక సంవత్సరం, మదింపు సంవత్సరాన్ని ఇకపై పన్ను సంవత్సరంగా పిలుస్తారు. పన్ను చెల్లింపుదారుల మనస్సులలోని గందరగోళాన్ని తొలగించేందుకు ప్రభుత్వం ఇలా పేరులో మార్పులు చేసింది.

**ఐటీఆర్ గడువు:**
జీతభత్యాలు పొందే ఉద్యోగులకు (ఐటీఆర్-1,ఐటీఆర్-2) గడువు జూలై 31వ తేదీగానే ఉంటుంది. నాన్-ఆడిట్ కేసుల (ఐటీఆర్-3, ఐటీఆర్-4) గడువును ఆగస్టు 31వ తేదీ వరకు పొడిగించారు.

**ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడర్లపై భారీ ఖర్చులు :**
సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ (ఎస్టీటీ)లో కీలక మార్పు జరిగింది. ఫలితంగా, ఎఫ్ అండ్ ఓ పెట్టుబడిదారులు ఇప్పుడు అధిక ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్టీటీని 0.12 శాతం నుంచి 0.15 శాతానికి పెంచారు.

**హెచ్ఆర్ఏ నిబంధనలు కఠినతరం:**
కొత్త నిబంధనల ప్రకారం హెచ్ఆర్ఏ మినహాయింపులు కొనసాగుతాయి. కానీ, అదనపు పత్రాలు అవసరమవుతాయి. ఉద్యోగులు ఇప్పుడు తమ ఇంటి యజమాని పాన్ కార్డ్, అద్దె పేమెంట్లకు సంబంధించి వ్యాలీడ్ ప్రూఫ్ సమర్పించాల్సి ఉంటుంది.

**మీల్ కార్డ్ లిమిట్ పెంపు:**
యజమాని అందించే మీల్ కార్డులపై పన్ను రహిత పరిమితిని రూ. 50 నుంచి రూ. 200కి పెంచారు. ఈ ప్రయోజనం పాత పన్ను విధానం కింద ఉద్యోగులకు అందుబాటులో ఉంటుంది.

**రూ.15 వేల వరకు గిఫ్ట్స్, వోచర్లు:**
ఏప్రిల్ 1, 2026 నుంచి కార్పొరేట్ గిఫ్ట్ కార్డులు, వోచర్‌లు, కూపన్‌లపై పరిమితిని రూ. 5వేల నుంచి రూ. 15వేలకు పెంచారు. ఈ మినహాయింపు పాత, కొత్త పన్ను విధానాలు రెండింటికి వర్తిస్తుంది.

**విద్యా భత్యం పరిమితి పెంపు:**
కొత్త నిబంధనల ప్రకారం.. విద్యా భత్యం పరిమితిని నెలకు రూ. 100 నుంచి రూ.3వేలకు పెంచారు. హాస్టల్ భత్యాన్ని నెలకు రూ. 300 నుంచి రూ. 9వేలకు పెంచారు.

**సావరిన్ గోల్డ్ బాండ్స్:**
ఒక వ్యక్తి సెకండరీ మార్కెట్ నుంచి సావరిన్ గోల్డ్ బాండ్లను కొనుగోలు చేస్తే.. మూలధన లాభాల పన్నుకు లోబడి ఉంటారు. ఈ బాండ్లను జారీ కాలంలో కొనుగోలు చేస్తే వాటికి మినహాయింపు కొనసాగుతుంది.

**పాన్ కార్డ్ నిబంధనలలో మార్పులు:**
పాన్ కార్డులు పొందే నిబంధనలలో కీలక మార్పు.. గతంలో పాన్ కార్డులను కేవలం ఆధార్ ద్వారా మాత్రమే పొందేవారు. ఇకపై వ్యక్తులు లేదా సంస్థలు తమ కేటగిరీలలో పాన్ కార్డులను తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. ఒక ఆర్థిక ఏడాదిలో రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ క్యాష్ డిపాజిట్ చేస్తే పాన్ కార్డ్ తప్పనిసరి.

**ప్రమాద కేసులపై నో టాక్స్:**
మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ నుంచి అందుకున్న పరిహారంపై ఎలాంటి టీడీఎస్ కట్ కాదు. ఇకపై పూర్తిగా పన్ను రహితంగా ఉంటాయి.

**క్రెడిట్ కార్డు వినియోగంపై నజర్:**
ప్రస్తుతం దేశంలో 11 కోట్లకు పైగా యాక్టివ్ క్రెడిట్ కార్డ్ వినియోగదారులు ఉన్నారు. ప్రతి నెలా రూ. 2 లక్షల కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. ఇకపై ఆదాయపు పన్ను శాఖ మీ లావాదేవీలను నిశితంగా గమనిస్తుంది. బ్యాంకులు రూ. 10 లక్షలకు మించిన ఖర్చులను రిపోర్టు ఆదాయపన్ను శాఖకు రిపోర్టు చేయొచ్చు.

**పాన్-క్రెడిట్ కార్డ్ లింకింగ్ :**
క్రెడిట్ కార్డులకు పాన్‌ను లింక్ చేయడం తప్పనిసరి. ఏప్రిల్ 1వ తేదీ తర్వాత, బ్యాంకులు పాన్ లేకుండా క్రెడిట్ కార్డులు జారీ చేయరు. మీ ప్రస్తుత క్రెడిట్ కార్డును మీ పాన్‌కు లింక్ చేసి ఉండాలి. మీ క్రెడిట్ కార్డు మీ పన్ను ఐడెంటిటీగా పనిచేస్తుంది. మీ క్రెడిట్ కార్డు స్టేట్‌మెంట్ 3 నెలల కన్నా పాతది కాకపోతే పాన్ కోసం అప్లయ్ చేస్తే అదే అడ్రస్ ప్రూఫ్ గా ఇవ్వొచ్చు.

# కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు



హుజూరాబాద్, మార్చి 31 (ఈవార్తలు): హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తెలంగాణ సీఐడీ అధికారులు నోటీసులు అందజేశారు. ఏప్రిల్ 4న హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. గతంలో ఆయన చేసిన కొన్ని వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఈ నోటీసులు జారీ అయ్యాయి. కేసు వివరాల్లోకి వెళితే... జనవరి 29న హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంకలో జరిగిన 'మినీ మేడారం' (సమ్మక్క-సారలమ్మ) జాతర సందర్భంగా గొడవ చోటుచేసుకుంది. జాతరకు వెళుతున్న కౌశిక్ రెడ్డిని, ఆయన కుటుంబాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులతో ఆయన తీవ్రంగా వాగ్వాదానికి దిగారు. తనను అడ్డుకున్న పోలీసులు, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై కౌశిక్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సీపీ మతాన్ని ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై ఐపీఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ క్షమాపణలు డిమాండ్ చేసింది. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, ఉన్నతాధికారులపై వ్యక్తిగత, మతపరమైన దూషణలకు దిగడం వంటి అంశాలపై అప్పట్లో నమోదైన కేసును ఇప్పుడు సీఐడీ విచారిస్తోంది. దీనికి సంబంధించి ఆయన వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశారు.

### కావాలనే వేధిస్తున్నారు: కౌశిక్ రెడ్డి

తనకు సీఐడీ నోటీసులు అందడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కక్షతోనే తనను ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆరోపించారు. "రేవంత్ రెడ్డి గారు... నన్ను లక్ష్యంగా చేసుకోండి, నాపై ఎన్ని కేసులైనా పెట్టండి, నోటీసులు ఇవ్వండి. కానీ నా కుటుంబాన్ని, మా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులను ఈ గొడవల్లోకి లాగి ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం?" అని ప్రశ్నించారు. ఏ తప్పు చేయకపోయినా కావాలనే వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని బెదిరింపులకు గురిచేసినా తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. "ఇది నా వ్యక్తిగత పోరాటం కాదు, ప్రజల కోసం చేస్తున్న పోరాటం. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటాను" అని హెచ్చరించారు. ప్రశ్నించే గొంతును అధికార బలంతో అణచివేయలేరని, ప్రజల పక్షాన తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని అన్నారు. జనవరి 29న హుజూరాబాద్ నియోజకవర్గం వీణవంకలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా పోలీసులతో కౌశిక్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో, ఆయనపై కేసు నమోదయింది. ఈ క్రమంలో, ఏప్రిల్ 4న విచారణకు హాజరుకావాలని సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు.

## చిన్నారిపై లైంగికదాడి..

# కామాంధుడి అరెస్టు



గోల్కొండ-రంగారెడ్డి, మార్చి 31 (ఈవార్తలు): హైదరాబాద్‌లో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడుతున్న ఆమె కజిన్‌ను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అరెస్ట్ చేసింది. బాలికను రక్షించి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయెల్ మంగళవారం తెలిపారు. చిన్నారులపై లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కేసులో 19 ఏళ్ల యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఆమె ప్రకటించారు. టీజీసీఎస్‌బీ పరిధిలోని చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌కు (సీపీయూ) చెందిన టిప్‌లైన్ ద్వారా అందిన ఆధారాలను విశ్లేషించగా ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. ఈ అఘాయిత్యం గురించి బాలిక తల్లిదండ్రులకు తెలిసి ఉండకపోవచ్చని కూడా అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితుడిని గోల్కొండ, ఛోటా బజార్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫహాద్ (19)గా గుర్తించారు. అతను డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. టిప్‌లైన్‌లో షేర్ అయిన వీడియోను క్షుణ్ణంగా పరిశీలించిన టీజీసీఎస్‌బీ అధికారులు నిందితుడిని గుర్తించారు. అతడిని ప్రశ్నించగా, తన నేరాన్ని అంగీకరించాడు. బాధితురాలి ఇంటికి తరచూ వెళ్లే ఫహాద్, ఆ చిన్నారిని ఇంటి టెర్రస్‌పైకి తీసుకెళ్లి ఈ దారుణానికి పాల్పడేవాడని విచారణలో తేలింది. నిందితుడు ఉపయోగించిన ఎలక్ట్రానిక్ పరికరాన్ని స్వాధీనం చేసుకుని, తదుపరి విచారణ కోసం డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపించారు. ఈ ఘటనపై శిఖా గోయెల్ స్పందిస్తూ, "ఈ ఏడాది మైనర్ బాలికలను రక్షించడం ఇది రెండోసారి. రెండు ఘటనల్లోనూ నిందితులు బాధితులకు అత్యంత సన్నిహితులే కావడం బాధాకరం. ప్రస్తుత కేసులో, నిందితుడు స్వయంగా బాధితురాలి కజిన్ బ్రదర్. ఆ చిన్నారి అమాయకంగా అతడిని 'భయ్యా' అని పిలుస్తుంది," అని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిపై ఐటీ చట్టంలోని సెక్షన్ 67-బి, పోక్సో చట్టంలోని సెక్షన్లు 3, 4, 15 కింద కేసు నమోదు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. రక్షించిన చిన్నారికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని, ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని డైరెక్టర్ తెలిపారు. పిల్లలపై లైంగిక నేరాల్లో చాలా వరకు నిందితులు కుటుంబానికి తెలిసిన వారే ఉంటున్నారని, కాబట్టి పిల్లల సంరక్షణ విషయంలో ఎవరిని నమ్మాలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని ఆమె సూచించారు. అధునాతన సాంకేతికతతో ఇలాంటి నేరాలను అరికట్టేందుకు టీజీసీఎస్‌బీ నిరంతరం పనిచేస్తోందని, చిన్నారులకు హాని చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బెంగళూరులో తెలంగాణ టెకీ దంపతుల ఆత్మహత్య

బెంగళూరు/సిద్దిపేట, మార్చి 31 (ఈవార్తలు): తెలంగాణకు చెందిన టెకీ దంపతులు బెంగళూరులో ఆత్మహత్యకు పాల్పడ్డారు. భర్త ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోగా, ఆ తర్వాత అతడి భార్య అపార్టుమెంట్‌లోని 17వ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సిద్దిపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కుంట భానుచందర్ రెడ్డి (32) బెంగళూరులోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం, భార్య షాజియా లేనిసమయంలో భానుచందర్ రెడ్డి కొత్తనూరులోని తన అపార్టుమెంట్‌లోని ఒక గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చిన షాజియా గది తలుపు తట్టింది. అతను స్పందించకపోవడంతో ఆమె సెక్యూరిటీని, చుట్టుపక్కల వారిని పిలిచింది. వారు తలుపులు బద్దలు కొట్టి చూడగా, భానుచందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనితో ఆ తర్వాత భార్య అపార్టుమెంట్‌లోని పదిహేడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఐబీఎంలో పని చేస్తోంది. తన మృతికి ఎవరూ కారణం కాదని భానుచందర్ రెడ్డి సూసైడ్ నోట్ రాశాడు. పోలీసులు ఈ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. తీవ్ర మానసిక ఒత్తిడి వల్ల అతను ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. తెలంగాణలోని ఇరు కుటుంబాలు దాఖలు చేసిన ఫిర్యాదుల మేరకు పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. ఆరోగ్య సమస్యలు, సహజీవనం కారణంగా ఇబ్బందులు, మానసిక ఒత్తిడి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, భానుచందర్ రెడ్డి అనారోగ్యం కారణంగా కొన్నిరోజులుగా ఇంటివద్దే ఉంటున్నాడు. భార్య ఫ్లాట్‌లో లేని సమయంలో భర్త ఉరివేసుకున్నాడు. గతంలో సహజీవనం చేసిన వీరిద్దరు, తొమ్మిదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వారి మధ్య తరుచూ గొడవలు జరిగేదని తెలుస్తోంది.

# రాష్ట్ర ఆర్థికం అస్తవ్యస్తం

## రేవంత్ ప్రభుత్వంపై కవిత ఫైర్



హైదరాబాద్, మార్చి 31 (ఈవార్తలు): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని, రోజువారీ ఖర్చుల కోసం కూడా ప్రభుత్వం ఆర్బీఐ ముందు చేయి చాచాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్ వెల్లడించిన గణాంకాలను ప్రస్తావిస్తూ ఆమె సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్‌ను పెట్టారు. కాగ్ నివేదిక ప్రకారం... గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఏడాది మొత్తం మీద కేవలం రెండు రోజులు తప్ప, మిగిలిన 363 రోజులు ప్రభుత్వం ఆర్బీఐ నుండి వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఓవర్ డ్రాఫ్ట్‌ల పేరుతో నిధులు సేకరించిందని కవిత పేర్కొన్నారు. "సుమారు రూ. 1.30 లక్షల కోట్లు తెచ్చి సర్కారును నెట్టుకొచ్చారు. 2025 మార్చి 31 నాటికి సుమారు రూ. 6 వేల కోట్లు తిరిగి చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది" అని ఆమె ఆరోపించారు. రాష్ట్రానికి నెలకు రూ. 12 వేల కోట్ల సొంత ఆదాయం ఉన్నప్పటికీ, రోజువారీ ఖర్చులకు కనీసం రూ. 1.38 కోట్ల బ్యాలెన్స్ కూడా మెయింటైన్ చేయలేకపోతున్నారని కవిత విమర్శించారు. రాష్ట్రంపై మొత్తం రూ. 8.65 లక్షల కోట్ల అప్పులు మోపి, ప్రతి కుటుంబంపై సగటున రూ. 9 లక్షల భారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వేసిందని ధ్వజమెత్తారు. అప్పులు తెస్తూ ఇంకా మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రమని చెప్పడం ప్రజలను వంచించడమేనని ఆమె మండిపడ్డారు. ఎన్నికల సమయంలో 'సంపద పెంచుతాం.. పేదలకు పంచుతాం' అని కాంగ్రెస్ నేతలు చెప్పిన మాటలు వట్టి డొల్ల అని కాగ్ నివేదికతో తేలిపోయిందని కవిత ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి, తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానిదేనని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగ్ నివేదిక సాక్షిగా ప్రభుత్వ వైఫల్యం బట్టబయలైందని ఆమె స్పష్టం చేశారు.




# నేటి నుంచి చికెన్ దుకాణాలు బంద్!

**నిరవధిక బంద్‌కు చికెన్ షాప్ ఓనర్ల పిలుపు**

హైదరాబాద్, మార్చి 31 (ఈవార్తలు): రాష్ట్రంలో బుధవారం నుంచి చికెన్ దుకాణాలు బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తామని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. గతంలో కంటే మార్జిన్ ఇప్పుడు తక్కువగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పౌల్ట్రీ వాళ్లు రిటైల్ దుకాణాలకు కిలోకు రూ.26 మార్జిన్ ఇచ్చేవారని, గత ఇరవై ఏళ్లుగా ఇదే మార్జిన్ ఇస్తున్నారని, ఇటీవల ఈ మార్జిన్ రూ.16కు తగ్గించారని దుకాణ యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. కేజీ చికెన్ మార్జిన్ రూ.30 ఇవ్వాలని ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అందుకే మార్జిన్ పెంచే వరకు రేపటి నుంచి నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభాలు తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారినట్లు అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. తక్కువ మార్జిన్ వల్ల వ్యాపారుల జీవనోపాధి సవాల్‌గా మారిందని అంటున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్


సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

# 'మూసీ'పై ప్రజాభిప్రాయ సేకరణ

**తెలంగాణ సబ్ కమిటీ కీలక నిర్ణయం**

హైదరాబాద్, మార్చి 31 (ఈవార్తలు: మూసీ నది పునరుజ్జీవంపై తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పనులను ప్రజాస్వామ్యబద్ధంగా చేపట్టాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. ఇందుకోసం మూసీ పునరుజ్జీవంపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించనున్నట్లు తెలిపింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కూడిన సబ్ కమిటీ, సంబంధిత అధికారులతో ఈరోజు సమావేశమైంది. మార్చి 31వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఏప్రిల్ 15వ తేదీ వరకు తమ అభిప్రాయలను, సూచనలను నేరుగా ఎబంఅతీతీఃఎఎవ్రఝఅశ్రీ.ఆశీఎ కు మెయిల్ చేయవచ్చు.

# ఐదు రోజుల పాటు వర్షాలు



హైదరాబాద్, మార్చి 31 (ఈవార్తలు): రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అటు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.

# ఇద్దరు పిల్లల ప్రాణం తీసిన తల్లి

కూకట్‌పల్లి, మార్చి 31 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కట్టుకున్న భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న మనస్తాపంతో ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను చంపి, ఆపై తాను ఆత్మహత్యకు పాల్పడింది. ఈ హృదయ విదారక ఘటన కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో వెలుగుచూసింది. వివరాల్లోకెళితే.. స్థానికంగా స్రవంతి (28) అనే మహిళ తన భర్తతో కలిసి నివాసం ఉంటోంది. వీరికి కార్తిక్ (12), కౌశిక్ (8) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, కొంతకాలంగా ఆమె భర్త వేరొకరితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న విషయం తెలిసి స్రవంతి తీవ్ర మనోవేదనకు గురైంది. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తితో దారుణమైన నిర్ణయం తీసుకుంది. ముందుగా తన ఇద్దరు కుమారులను చంపి, అనంతరం తాను కూడా బలవన్మరణానికి పాల్పడింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. భర్త వివాహేతర సంబంధమే ఈ దారుణానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కన్నతల్లే పిల్లలను కడతేర్చిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# నైపుణ్యాలే జీవనోపాధి



## విద్యార్థులు ఆవిష్కరణల వైపు అడుగేయాలి.. సీనియర్ ఐఏఎస్ జయేశ్ రంజన్ సూచన

### హైదరాబాద్‌లో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ నిర్వహణ

హైదరాబాద్, మార్చి 31 (పీఐబీ): విద్యాభ్యాసంతో పాటు నైపుణ్యాభివృద్ధి చాలా ముఖ్యమని సీనియర్ ఐఏఎస్ జయేశ్ రంజన్ అన్నారు. పరిస్థితులకు అనుగుణంగా మార్పు, ఆవిష్కరణ, పని నైపుణ్యంపై ఉపాధి అవకాశాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ ఇనిస్టిట్యూట్‌లో రాష్ట్ర స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2026ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడవద్దని విద్యార్థులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అన్సుమన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ.. దేశ నిర్మాణ కార్యక్రమాల్లో యువత భాగస్వామ్య ప్రాముఖ్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 150 మంది పోటీదారులు పాల్గొన్నారు. 'కేంద్ర బడ్జెట్ 2026: వికసిత్ భారత్-2047 దిశగా యువతకు మార్గాన్ని బలోపేతం చేయటం' ఇతివృత్తంపై పోటీదారులు చర్చించి, అభిప్రాయాలను, విధానపరమైన సూచనలను పంచుకున్నారు. ఈ చర్చలో భాగంగా ప్రథమ స్థానం- టీ నిఖిత, హైదరాబాద్; ద్వితీయ స్థానం- కే అఖిల, ఖమ్మం; తృతీయ స్థానం- జే ప్రగతి, జగిత్యాల విజేతలుగా నిలిచారు. వీరు పార్లమెంటులో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, మీడియా, కమ్యూనికేషన్ అధికారిణి వర్గంతి గాయత్రి, ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఈఎఫ్ఎల్‌యూ) అసోసియేట్ ప్రొఫెసర్ రాజారాం, సీనియర్ జర్నలిస్టు దిలీప్ రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జీఎన్ జగన్ జ్యూరీ ప్యానెల్ సభ్యులుగా వ్యవహరించారు. జిల్లా యూత్ అధికారి టీ ఇసయ్య, మై భారత్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## కొండగట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్యాల, మార్చి 31 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ మూర్తులని మాలవిరమణ మండపానికి తీసుకెళ్లారు. బుధవారం నుంచి హనుమాన్ దీక్షపరులకు మాలవిరమణ చేయనున్నారు. హనుమాన్ విజయోత్సవ వేడుకల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఆసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో అంజనారెడ్డి పేర్కొన్నారు.

## అలయన్స్ కమిటీ చైర్మన్‌గా కటుకం సురేందర్



కోరుట్ల, మార్చి 31 (ఈవార్తలు): రాజస్థాన్ లోని జైపూర్ లో జరిగిన అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2026 మీటింగ్‌లో అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్‌గా కోరుట్లకు చెందిన కటుకం సురేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా బాల గంగాధర్ శాస్త్రి, డైరెక్టర్‌గా కటుకం రాజేంద్ర ప్రసాద్ ఎన్నికయ్యారు. వీరి నియామకం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.




## విలాసాల పాస్టర్.. విలేకరిగా వసూళ్లు!

కాకినాడ, మార్చి 31 (ఈవార్తలు): అతడు ఒక చర్చి పాస్టర్.. విలాసాలకు అలవాటు పడి, పత్రిక విలేకరినని అవతారం ఎత్తి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. రహదారిపై వెళ్లే చికెన్ వేస్ట్ తరలించే వాహనాలు, పశువుల అక్రమ రవాణా చేసే వాహనాలను, రేషన్ బియ్యం తరలించే వాహనాలు, ఇటుక బట్టీలకు మట్టిని తరలించే వాహనాలను ఆపుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఈ కేటుగాడి ఆగడాలకు ఏపీలోని కాకినాడ జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు చెక్ పెట్టారు. మీడియా అని ప్రాధేయపడినా వదిలిపెట్టకుండా కేసు నమోదు చేసి కోర్టులో నిలబెట్టారు. కాకినాడ జిల్లా, తాళ్ళరేవు చెక్ పోస్ట్ సమీపంలో సోమవారం సాయంత్రం ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ కాకినాడ సీఐ లక్ష్మీ తులసి, ఎస్సై శ్రీనివాస్ వాహన తనిఖీలు నిర్వహించగా, యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న 2 లీటర్ల 6 అక్రమ మద్యం సీసాలు, 24 బీర్ టిన్లు, కారును స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన ప్రధాన నిందితుడు ప్రత్తిపాడుకు చెందిన పాస్టర్ రజాల రాజ్ కుమార్ అని పోలీసులు తెలిపారు.

## కుంతీ మాధవ ఆలయానికి మహర్దశ



కాకినాడ, మార్చి 31 (ఈవార్తలు): ఏపీలోని పిఠాపురం నియోజకవర్గం పంచమాదవ క్షేత్రాల్లో ఒక్కటేనా పుణ్యక్షేత్రం శ్రీ కుంతీ మాధవ దేవస్థానానికి మహర్దశ పట్టనుంది. పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఆలయంతో పాటు కోనేరును కూడా అభివృద్ధి చేసి ప్రజలు సందర్శించే విధంగా దాన్ని తీర్చిదిద్దాలని అధికారులు నిర్ణయించారు. పడ ఆఫీస్ ఎస్వీ శివరామ్ ప్రసాద్ దానిని పరిశీలించి భవిష్యత్తులో ఎటువంటి రోడ్డు విస్తరణ జరిగినా ఆటంకం రాకుండా ఒక ఆర్కిటెక్టును రప్పించి, అంచనా వ్యయాన్ని లెక్కించారు. ఈ వివరాలను పవన్ కల్యాణ్‌కు తెలియజేస్తామని, ఆయన ఆదేశాల మేరకు పనులు మొదలుపెడతామని శివరాం తెలిపారు. ఆలయాన్ని సందర్శించిన వారిలో శ్రీ కుంతి మాధవ స్వామి ఆలయ ఈవో ధనలక్ష్మి, ఆర్కిటెక్ట్, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు, పడ ఆఫీస్ సిబ్బంది, సత్యనారాయణ ఆలయ సిబ్బంది, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ నాయకత్వం వల్లే

# నక్సల్స్ రహిత భారతం

### లోక్ సభ చర్చలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



కాకినాడ, మార్చి 31 (ఈవార్తలు): దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో సమర్థవంతమైన నాయకత్వం, దృఢమైన సంకల్పం తో భారత్ నేడు నక్సల్ రహిత దేశంగా మారడం శుభసూచకమని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం లోక్ సభ లో 'వామపక్ష తీవ్రవాదం నుండి దేశం విముక్తికి చర్యలు' అనే అంశంపై జరిగిన చర్చలో కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడారు. దేశాన్ని ఐదు దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న నక్సల్స్ సమస్య దేశ అంతర్గత భద్రత కు సవాల్ గా మారిందన్నారు. 1967 లో పుట్టిన నక్సల్ బరి ఉద్యమం గత పాలకుల నిర్లక్ష్యం వల్ల దేశంలో అన్ని ప్రాంతాలకు విస్తరించిందన్నారు. గత పదేళ్ల యూపీఏ పాలనలో దేశంలో 16,000 హింసాత్మక ఘటనలు జరగ్గా, 1800 మంది భద్రతా సిబ్బంది, 4,700 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్డీఏ ప్రభుత్వం నక్సల్ తీవ్రవాదాన్ని జాతీయ భద్రత అంశంగా గుర్తించడంతోపాటు ద్విముఖ వ్యూహంతో ముందుకు వెళ్తూ దేశంలో నక్సలిజాన్ని అంతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టిందన్నారు, 2017 లో 'సమాధాన్' సిద్ధాంతం ద్వారా నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి పనులు చేపట్టడంతో, గూఢచారి వ్యవస్థను పటిష్ట పరచడంతో పాటు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో గతంలో ఉన్న 66 పోలీస్ స్టేషన్ లను 600 వరకు పెంచడం, భద్రతా శిబిరాలు, హెలిపాడ్లు, మొబైల్ టవర్స్ ఏర్పాటు ద్వారా సత్ఫలితాలు వచ్చాయన్నారు. 80 శాతం హింసాత్మక ఘటనలు, 85 శాతం మరణాలు తగ్గగా 8 వేలకు పైగా మావోయిస్టు అగ్ర నాయకులు లొంగిపోయారని తెలిపారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభిప్రాయపడినట్లు తీవ్రవాదం అడవుల్లో పుట్టదని, అవకాశాల లేమితో పుడుతుందన్నారు. యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడమే నిజమైన విజయమన్నారు. దేశ అంతర్గత, అభివృద్ధితోనే స్థిరమైన ఫలితాలు వస్తాయని, ఇంకా ఉద్యమబాటలో ఉన్న నక్సల్స్ ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంచి ఆయుధాలు వీడి జనజీవనస్రవంతి లోకి రావాలని కోరారు. దేశాన్ని నక్సలిజం నుండి పూర్తిగా విముక్తి చేయాలనే లక్ష్యంతో ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, మనమంతా కలిసి నక్సల్స్ అధ్యాయాన్ని నియంత్రణ కాకుండా, శాశ్వతంగా ముగిద్దామని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు.



## పిఠాపురం ఎంసీ బూతులు..!

### చర్యలు తీసుకోవాలని స్వర్ణవార్డు సచివాలయ ఎంప్లాయ్ అసోసియేషన్ డిమాండ్

కాకినాడ, మార్చి 31 (ఈవార్తలు): ఏపీలోని పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు బూతులు తిడుతున్నారని స్వర్ణవార్డు ఎంప్లాయ్ అసోసియేషన్ మండిపడింది. వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శానిటైజర్ సెక్రెటరీ సుధీర్‌పై నోటికి వచ్చినట్లు దుర్భాషలాడారని, చర్యలను కోరుతూ పడా ఎస్వీ శివరాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో విప్పర్తి నిఖిల్ కృష్ణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, దారపు రెడ్డి తాతాజీరావు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ,షేక్ మహబూబ్ బాషా కాకినాడ జిల్లా ప్రెసిడెంట్, బి.జాన్ క్రిస్టఫర్ జిల్లా జనరల్ సెక్రెటరీ,పి.కన్నారావు జిల్లా వైస్ ప్రెసిడెంట్, బి.రాఘవులు పిఠాపురం మున్సిపాలిటీ ప్రెసిడెంట్, ఎస్.రాంబాబు పిఠాపురం మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, వి. సంధ్య రాణి వైస్ ప్రెసిడెంట్, ఎ.వి.డి. మోహన్ జనరల్ సెక్రెటరీ స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి

### టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

హైదరాబాద్, మార్చి 31 (ఈవార్తలు): అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పలు చట్టాలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయకపోవడం బాధాకరమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్( టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టాలు చేయడం, అందులో ముఖ్యంగా తల్లిదండ్రుల రక్షణ, న్యాయవాదుల రక్షణ వంటి చట్టాలు చేయడం అభినందనీయమని, అయితే చాలా కాలంగా తాము అడుగుతున్న జర్నలిస్టుల రక్షణ చట్టం చేయకుండా విస్మరించడం, జర్నలిస్టుల పట్ల తీవ్ర వివక్ష చూపడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో జర్నలిస్టుల రక్షణ చట్టం కోసం తమ అనుబంధ యూనియన్ అయిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) చాలా కాలంగా పోరాడుతుందని, అదే విధంగా రాష్ట్రస్థాయిలో ఈ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశ పెట్టి ఆమోదింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఇప్పటికే చత్తీస్ ఘడ్ లో జర్నలిస్టుల రక్షణకు చట్టం చేశారని, అదేవిధంగా మహారాష్ట్రలో ఇలాంటి చట్టం వచ్చిందని, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశాతో సహా అనేక ఇతర రాష్ట్రాలలో జర్నలిస్టుల రక్షణ కోసం ఇలాంటి చట్టాలు తీసుకురావడాని అధ్యయన కమిటీలు వేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులకు రక్షణ కరువైందని, జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు పెరిగిపోతున్నాయని మామిడి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాలకంటే ఎక్కువ పోరాడిన జర్నలిస్టులను గత ప్రభుత్వం తీవ్ర వివక్షతో విస్మరించిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం అవలంభించి వైఖరినే అవలంభిస్తున్నదని ఆయన విమర్శించారు. మొన్నటి రాష్ట్ర బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేదని, జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ లో రూపాయి కేటాయింపులు లేవు, ఇండ్ల స్థలాల్లేవు, పెన్షన్ లేదు, పత్రికలకు రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ లేవు, అక్రెడిటేషన్ కార్డులు, ఆరోగ్య కార్డులు లేవని అన్నారు. జర్నలిస్టులను వారి కుటుంబాలను పాలకులు పూర్తిగా విస్మరించడం సరైంది కాదని, ఇది ప్రభుత్వానికే మంచిది కాదని అన్నారు. జర్నలిస్టుల సమస్యలు, ప్రభుత్వ వైఖరి పట్ల ఇతర ప్రధాన జర్నలిస్టు సంఘాలు కిమ్మనకపోవడం విచారకరమని అన్నారు. గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## 27 బైకులు చోరీ చేశాడు!

ఒంగోలు, మార్చి 31 (ఈవార్తలు): ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా 27 బైకులను ఒక్కడే చోరీ చేశాడు. చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగగా మారిన ఓ వ్యక్తిని ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.10 లక్షల విలువైన 27 మోటార్‌సైకిళ్లను, కిలోకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే, సోమవారం మధ్యాహ్నం ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి మామిడిపాలెం సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన అద్దేటి ఏడుకొండలు (35) అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని ఆపి తనిఖీ చేయగా, దొంగిలించిన బైక్‌తో పాటు 1.175 కిలోల గంజాయి లభించింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజాలు బయటపడ్డాయి. చెడు వ్యసనాలకు డబ్బు అవసరం కావడంతో బైక్ దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నట్లు ఏడుకొండలు అంగీకరించాడు. ఒంగోలు, మద్దిపాడు, అద్దంకి, వినుకొండ, గుంటూరు, నరసరావుపేట, జి.కొండూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 27 బైకులు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. అతని సమాచారం మేరకు పోలీసులు ఆయా బైకులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.12 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడిపై గతంలోనూ ఒంగోలు, గుంటూరులో పలు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, సీఐ నాగరాజుతో పాటు ప్రత్యేక బృందంలోని సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, పక్కా ప్రణాళికతో నిందితుడిని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

## నేతన్నలకు ఉచిత కరెంట్

### నేటి నుంచే 'పవర్' గిఫ్ట్

మంగళగిరి, మార్చి 31 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక కానుక అందించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానుంది. దీని కింద చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు (మరమగ్గాలకు) 500 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేయనున్నారు. విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించి, సంక్షోభంలో ఉన్న చేనేత వృత్తికి అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,04,488 చేనేత కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది.

# దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్

### అమరావతిలో ఏప్రిల్ 14 నుంచి అందుబాటులోకి




అమరావతి, మార్చి 31 (ఈవార్తలు): ఏపీ రాజధాని అమరావతిలో సాంకేతిక విప్లవానికి కీలక అడుగు పడింది. దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ ఏప్రిల్ 14వ తేదీ నుంచి అందుబాటులోకి రానుంది. విద్యార్థులు, పరిశోధకులు ఈ అత్యాధునిక సాంకేతికతను టెస్టింగ్ కోసం వినియోగించుకోవచ్చని క్యూబిట్ ఫోర్స్ సంస్థ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణ్యన్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ కీలక ప్రకటన వెలువడింది. అమరావతి క్వాంటం వ్యాలీలో క్వాంటం హార్డ్‌వేర్ తయారీ ఎకోసిస్టమ్ ఏర్పాటుపై ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో నేషనల్ క్వాంటం మిషన్ (ఎన్‌క్యూఎం) డైరెక్టర్ జేబీవీ రెడ్డి, స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఐబీఎం డైరెక్టర్ అమిత్ సింఘీ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన సీడాక్, సీడాట్, డీఆర్డీఓ, బార్క్, నేవల్ సైన్స్ టెక్నాలాజికల్ లేబొరేటరీ ప్రతినిధులు హాజరయ్యారు. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని ఎన్‌క్యూఎం డైరెక్టర్ జేబీవీ రెడ్డి ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో క్వాంటం ఎకోసిస్టమ్‌కు అనువుగా టెస్ట్ బెడ్స్, సర్టిఫికేషన్ కేంద్రాలు ఉండాలని సీడాక్ ఈడీ సుదర్శన్ సూచించారు. క్వాంటం సిమ్యులేటర్స్‌తో పాటు బయో సెన్సార్స్, మినరల్ సెన్సార్స్, లేజర్ అప్లికేషన్స్ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వివిధ క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు ముఖ్యమంత్రికి తెలియజేశాయి. ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ కామకోటి వర్చువల్‌గా పాల్గొనగా, ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ సత్యనారాయణ కూడా హాజరయ్యారు. ఈ సమావేశానికి మొత్తంగా 30కి పైగా క్వాంటం కంప్యూటింగ్, క్రయోజనిక్స్, ఫోటోనిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీల ప్రతినిధులు హాజరుకావడం విశేషం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 15 కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. వీటిలో 7 సంస్థలు విజయవాడలోని మేధా టవర్స్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. ఈ పరిణామాలతో అమరావతి దేశ క్వాంటం టెక్నాలజీకి కేంద్రంగా మారే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది.



## పేద కుటుంబాలకు ఆసరాగా యలమందల జగదీశ్

ఖమ్మం, మార్చి 31 (ఈవార్తలు): ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెం,1వ డివిజన్ లో నివాసముంటున్న బోడ నాగేశ్వరరావు (చిన్న), బోడ ఉమ అనారోగ్యంతో మరణించడంతో అనాథలుగా మిగిలిన ముగ్గురు పిల్లలకు, అనారోగ్యంతో ఒంటరి జీవితం గడుపుతున్న బొమ్మకంటి బూబమ్మ కుంటుంబానికి నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఖమ్మం అధ్యక్షుడు యలమందల జగదీశ్ అండగా నిలిచారు. నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, 25కేజీల బియ్యం, ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గుర్రం వెంకట్రామయ్య, తుళ్లూరు ప్రసాద్, గుర్రం కృష్ణయ్య, తేజావత్ వీరన్న, గద్దల నాగేశ్వరరావు, తేజావత్ సంఘం, జక్కంపూడి సతీష్, తుళ్లూరు మధు, జగదీష్ యువసైన్యం మంచాల నాగ, తోట సతీష్, ఆంగోతు కిషోర్, కంచర్ల శేఖర్, పందుల కార్తిక్, ఉప్పెర్ల ఉదయ్, కొండా రాకేష్, బొమ్మకంటి జగదీష్, లింగనబోయిన నవదీప్, మంచాల రాజు, లింగనబోయిన హేమంత్, మల్లు భరత్, రాగం పండు, వనపర్తి ఉదయ్, తేజావత్ బాలకృష్ణ, కుమ్మరకుంట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఏటా 2 సిలిండర్లు ఫ్రీ

## కేరళలో బీజేపీ హామీలు

తిరువనంతపురం: కేరళలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. కేరళ ఎన్నికల్లో బీజేపీ పలు ఉచిత పథకాలను ప్రకటించింది. పేద కుటుంబానికి సంవత్సరానికి రెండు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు ఇస్తామని ప్రకటించింది. ఇందులో ఒకటి ఓనం పండుగ సమయంలో ఒకటి, రెండోది క్రిస్మస్ పండుగ సమయంలో ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రతి ఇంటికి నెలకు 20,000 లీటర్ల నీరు ఉచితంగా అందిస్తామని తెలిపింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల మహిళలకు 'భక్ష్య ఆరోగ్య సురక్ష కార్డు' ద్వారా నెలకు రూ.2,500 ఇస్తామని తెలిపింది. వితంతువులు, పేద కుటుంబాల మహిళలకు, 70 సంవత్సరాలు పైబడిన పౌరులకు నెలకు రూ.3,000 పెన్షన్ ఇస్తామని తెలిపింది. తిరువనంతపురంలో ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు.

# రాజకీయ రాబందు కాంగ్రెస్

## దేశ ఐక్యతను దెబ్బతీసే కుట్రలు.. ప్రజలను భయపట్టేలా తప్పుడు పనులు.. హస్తం పార్టీపై ప్రధాని మోదీ ఫైర్

ముంబై: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన, భౌగోళిక రాజకీయ సవాళ్లు నెలకొన్నప్పటికీ, భారతదేశం స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. మంగళవారం గుజరాత్‌లోని వావ్-థరాడ్‌లో రూ.19,800 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తూ, కాంగ్రెస్ వదంతులను ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారని మండిపడ్డారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని మోదీ అన్నారు. 'ప్రపంచంలోని ఎన్నో దేశాలు అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. డీజిల్, పెట్రోల్, గ్యాస్ సమస్యలతో సతమతమవుతున్నాయి. అయితే, మన విజయవంతమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యత వల్ల భారత్ ఈ పరిస్థితులను అదుపులో ఉంచగలిగింది' అని ఆయన వివరించారు. చిన్న దేశాల నుంచి అగ్రరాజ్యాల వరకు ఇంధన ధరలు 10 నుంచి



25 శాతం పెరిగాయని, కానీ భారత్ మాత్రం ఆ భారాన్ని ప్రజలపై పడనీయడం లేదని తెలిపారు. ఈ వాస్తవాలను కాంగ్రెస్ చూడలేకపోతోందని మోదీ విమర్శించారు. "దేశానికి ఐక్యత అవసరమైన ఈ సమయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ ముందుంది. ధైర్యం చెప్పాల్సిన చోట భయాన్ని, వదంతులను వ్యాపింపజేస్తున్నారు. రాజకీయ రాబందుల్లా దేశంలో గందరగోళం కోసం ఎదురుచూస్తూ, ఎన్నికల లబ్ధి పొందాలని చూస్తున్నారు" అని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఇంధన ధరల విషయంలోనూ ప్రజలను క్యూలలో నిలబెట్టి లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించడంపై మోదీ సంతోషం వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్‌బేస్ అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. దేశ భద్రతకు ఇది చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ జరిగిందని గుర్తుచేశారు. "అప్పుడు ఢిల్లీలో అధికారంలో ఉన్నవారికి గుజరాత్‌పై ఎందుకో ద్వేషం. ఏళ్ల తరబడి ఫైళ్లను తొక్కిపెట్టి ప్రాజెక్టును అడ్డుకున్నారు. మీరు నన్ను ఢిల్లీకి పంపిన తర్వాత ఆ ఫైళ్లను బయటకు తీసి, ఈ ఎయిర్‌బేస్‌ను పూర్తి చేశాను" అని మోదీ తెలిపారు. ఈ ఆలస్యానికి కాంగ్రెస్ వైఖరే కారణమని, దేశ భద్రత విషయంలో వారి ప్రవర్తనను జాతి ఎప్పటికీ క్షమించదని అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలు భారత్‌ను ప్రశంసిస్తుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం దేశ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూశారని మోదీ ఆరోపించారు. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే శక్తుల మాదిరిగా కాంగ్రెస్ మాట్లాడుతోందని విమర్శించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో చూపిన ఐక్యతను ఇప్పుడు కూడా ప్రదర్శించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తర గుజరాత్ అభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, దేశీయ, అంతర్జాతీయ సవాళ్లను భారత్ ఎలా ఎదుర్కొంటుందో చెప్పడానికి నిదర్శనమని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.





# 30,000 మందికి ఒరాకిల్ గుడ్‌బై

న్యూయార్క్: ప్రముఖ క్లౌడ్ టెక్నాలజీ సంస్థ ఒరాకిల్ ప్రపంచవ్యాప్తంగా భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించే ప్రక్రియను ప్రారంభించింది. మంగళవారం ఉదయాన్నే అనేకమంది ఉద్యోగులకు ఈ-మెయిల్స్ పంపి, వారి ఉద్యోగాలను రద్దు చేస్తున్నట్లు తెలియజేసింది. ఈ పరిణామం టెక్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. అమెరికాలో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటల నుంచే ఉద్యోగులకు ఈ-మెయిల్స్ రావడం మొదలైంది. "సంస్థ ప్రస్తుత వ్యాపార అవసరాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, సంస్థాగత మార్పులలో భాగంగా మీ పాత్రను తొలగించాలని నిర్ణయించాం. దీని ఫలితంగా, ఈ రోజే మీకు చివరి పనిదినం" అని ఆ మెయిల్‌లో ఒరాకిల్ స్పష్టంగా పేర్కొంది. త్వరలోనే కంప్యూటర్, ఈ-మెయిల్, ఫైల్స్ యాక్సెస్‌ను నిలిపివేస్తామని, ఆ తర్వాత లాగిన్ కావడం సాధ్యం కాదని కూడా తెలిపింది. కంపెనీకి చెందిన రహస్య సమాచారాన్ని కాపీ చేయడం లేదా డౌన్‌లోడ్ చేయడం నిషేధమని ఉద్యోగులను హెచ్చరించింది. నివేదికల ప్రకారం, ఒరాకిల్ సుమారు 20,000 నుంచి 30,000 మంది ఉద్యోగులను తొలగించే అవకాశం ఉంది. ఇది కంపెనీ మొత్తం సిబ్బందిలో దాదాపు 18 శాతానికి సమానం.

# ఇరాన్ అంతు చూసేదాకా వదలొద్దు

### ట్రంప్‌కు గల్ఫ్ దేశాల విజ్ఞప్తి

దుబాయ్: ఇరాన్ పూర్తిగా బలహీనపడే వరకు లేదా ఓడిపోయేవరకు యుద్ధాన్ని కొనసాగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గల్ఫ్ దేశాలు విజ్ఞప్తి చేసినట్లు అసోసియేటెడ్ ప్రెస్ సంచలన కథనం వెల్లడించింది. ప్రస్తుత పాలనాయంత్రాంగం పూర్తిగా కూలిపోయేంత వరకు యుద్ధం ముగించవద్దని ట్రంప్‌ను పలు గల్ఫ్ దేశాలు ప్రైవేటుగా కోరాయి. ఈ కథనం ప్రకారం, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, బహ్రెయిన్ దేశాలు ట్రంప్‌ను కోరాయి. నెల రోజులుగా యుద్ధం జరుగుతున్నప్పటికీ ఇరాన్ అంతగా బలహీనపడలేదని, కాబట్టి యుద్ధాన్ని కొనసాగించాలని ఆ దేశాలు కోరాయి. ఇరాన్ నాయకత్వంలో గణనీయమైన మార్పు రావాలని, అప్పటి వరకు సైనిక చర్య ఆగకూడదని ఆ దేశాల అధికారులు ప్రైవేటు సంభాషణలో భాగంగా ట్రంప్‌ను కోరినట్లు ఆ కథనం తెలిపింది. అయితే, యుద్ధం ప్రారంభానికి ముందు తమకు సమాచారం ఇవ్వకపోవడం, యుద్ధం కారణంగా సంభవించే హెచ్చరికలను పట్టించుకోకపోవడంపై ఈ చర్చల సందర్భంగా ఆయా దేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయని తెలుస్తోంది. యుద్ధం ఎలాగూ ప్రారంభమైనందున, టెహ్రాన్ పాలనను పూర్తిగా కూలదోయాలని, ఇది చరిత్రాత్మక అవకాశమని కొన్ని దేశాలు అభిప్రాయం వ్యక్తం చేశాయని ఆ కథనం పేర్కొంది.

# హార్మూజ్ జలసంధిలో టోల్

### కీలక ప్రణాళికకు ఇరాన్ ఆమోదం

టెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. వ్యూహాత్మకంగా కీలకమైన హార్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ సాధించే దిశగా అడుగులు వేసింది. ఈ జలసంధి గుండా వెళ్లే నౌకలపై టోల్ విధించడంతో పాటు అమెరికా, ఇజ్రాయెల్ నౌకలను నిషేధించడం వంటి అంశాలతో కూడిన 'హార్మూజ్ జలసంధి నిర్వహణ ప్రణాళిక'కు ఇరాన్ పార్లమెంట్ సెక్యూరిటీ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ మీడియా సంస్థ ఐఆర్‌ఐబీ తన కథనంలో వెల్లడించింది. ఈ కొత్త ప్రణాళిక ప్రకారం హార్మూజ్ జలసంధిలో భద్రతా ఏర్పాట్లు, నౌకల భద్రత, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికపరమైన అంశాలపై ఇరాన్ దృష్టి సారించనుంది. ముఖ్యంగా ఈ జలసంధి గుండా ప్రయాణించే నౌకల నుంచి ఇరాన్ కరెన్సీ 'రియాల్' రూపంలో టోల్ వసూలు చేయనున్నారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు ఇరాన్‌పై ఏకపక్ష ఆంక్షలు విధిస్తున్న దేశాల నౌకలను కూడా ఈ జలసంధిలోకి అనుమతించబోమని ప్రణాళికలో స్పష్టంగా పేర్కొన్నారు. జలసంధిపై ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, సాయుధ బలగాల పాత్రను బలోపేతం చేయడం, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనలో ఒమన్‌తో సహకరించడం వంటివి కూడా ఈ ప్రణాళికలో భాగమని ఐఆర్‌ఐబీ నివేదిక తెలిపింది. ఇరాన్ నిర్ణయంపై అమెరికా



మండిపడింది. హార్మూజ్ జలసంధిని తిరిగి తమ నియంత్రణలోకి తీసుకుంటామని, అక్కడ స్వేచ్ఛాయుత నౌకాయానాన్ని పునరుద్ధరిస్తామని యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ స్పష్టం చేశారు. ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతానికి కొన్ని దేశాలు ఇరాన్‌తో వ్యక్తిగత ఒప్పందాలు కుదుర్చుకుని తమ నౌకలను పంపుతున్నాయి. కానీ, సమీప భవిష్యత్తులో అమెరికా యుద్ధ నౌకల ఎస్కార్ట్‌తో గానీ, బహుళ దేశాల కూటమి ఎస్కార్ట్‌తో గానీ జలసంధిపై నియంత్రణ సాధించి తీరుతాం" అని ఆయన అన్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇరాన్ వెంటనే హార్మూజ్ జలసంధిని వాణిజ్యానికి తెరవకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేస్తూ.. "ఒకవేళ త్వరగా ఒప్పందం కుదరకపోతే, హార్మూజ్ జలసంధిని తెరవకపోతే... ఇరాన్‌లోని అన్ని విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు, చమురు బావులు, ఖర్గ్ ద్వీపాన్ని పూర్తిగా ధ్వంసం చేస్తాం" అని ట్రంప్ హెచ్చరించారు. ప్రపంచంలోని చమురు రవాణాలో అధిక భాగం హార్మూజ్ జలసంధి గుండానే జరుగుతుంది. పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ కూటమి మధ్య రెండు నెలలుగా ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఈ కీలక జలమార్గంపై ఆధిపత్యం కోసం ఇరుపక్షాలు చేస్తున్న ప్రకటనలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి.

# జైల్లోకి సిమ్ కార్డులు!

### బెంగళూరులో పట్టుబడ్డ యువతి

బెంగళూరు: బెంగళూరు సెంట్రల్ జైల్లోకి మాదకద్రవ్యాలు, సిమ్ కార్డులను అక్రమంగా తరలించేందుకు యత్నించిన ఓ యువతిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితురాలిని రితికా రాయ్ (27)గా గుర్తించారు. మార్చి 26న సాయంత్రం 4 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే, పరప్పన అగ్రహార సెంట్రల్ జైల్లో విచారణ ఖైదీగా ఉన్న ఫర్హాన్ ఖాన్‌ను కలిసేందుకు రితికా రాయ్ విజిటర్ పాస్ తీసుకుంది. జైల్లోని జనరల్ ఇంటర్వ్యూ సెక్షన్‌లో సందర్శకులను తనిఖీ చేస్తుండగా, డ్యూటీలో ఉన్న మహిళా హెడ్ కానిస్టేబుల్‌కు రితికాపై అనుమానం వచ్చింది. దీంతో ఆమెను పక్కనే ఉన్న తనిఖీ గదికి తీసుకెళ్లి క్షుణ్ణంగా సోదా చేయగా అసలు విషయం బయటపడింది. తన మర్మాంగాలలో మూడు ప్యాకెట్లలో నిషేధిత పదార్థాలు, మూడు ఎయిర్‌టెల్ 5జీ సిమ్ కార్డులను దాచిపెట్టినట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న ప్యాకెట్లలో సుమారు 30 గ్రాముల గంజాయితో పాటు, మరో 30 గ్రాముల ఇతర మాదకద్రవ్యాలు



ఉన్నట్లు అధికారులు తెలిపారు. సీనియర్ జైలు అధికారుల సమక్షంలో ఈ వస్తువులను సీజ్ చేసి, తదుపరి పరీక్షల నిమిత్తం పంపించారు. భద్రతా తనిఖీలను దాటుకుని ఖైదీకి ఈ వస్తువులను చేరవేయాలని రితికా ప్రయత్నించినట్లు స్పష్టమైంది. ఈ ఘటనపై డ్యూటీలో ఉన్న అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు కర్ణాటక జైళ్ల (సవరణ) చట్టం, 2022, నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీఎస్) చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద రితికా రాయ్‌పై కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి సిబ్బంది వాంగ్మూలాలు, ఖైదీ వివరాలు, విజిటర్ పాస్ వంటి పత్రాలను కూడా సమర్పించారు. బెంగళూరు జైలులో స్మగ్లింగ్ యత్నాలు జరగడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ పలుమార్లు సిబ్బందే ఇలాంటి పనులకు పాల్పడి పట్టుబడ్డారు. ఇదే నెలలో, మార్చి 12న, ఓ జైలు వార్డెన్ ఖైదీలకు డ్రగ్స్ అందించేందుకు ప్రయత్నిస్తూ అరెస్టయ్యాడు. అతని వద్ద నుంచి గంజాయి, స్మోకింగ్ పైప్, మెథాంపెటమైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు, 2025 డిసెంబర్ 7న, రాహుల్ పాటిల్ అనే మరో వార్డెన్ తన లోదుస్తులలో నిషేధిత వస్తువులను దాచిపెట్టి హై-సెక్యూరిటీ జైల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించి దొరికిపోయాడు. మెయిన్ గేట్ వద్ద మెటల్ డిటెక్టర్ పదేపదే మోగడంతో భద్రతా సిబ్బంది అతడిని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, సిగరెట్ ప్యాకెట్లు, దాదాపు 60 గ్రాముల పేపర్ రూపంలోని నార్కోటిక్ పదార్థం బయటపడింది. ఇలా వరుస ఘటనలు జైలు భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రస్తుత ఘటనపై అధికారులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు.

## డీజీసీఏ కొత్త చీఫ్‌గా వీర్ విక్రమ్ యాదవ్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంలో భారీ స్థాయిలో ఉన్నతాధికారుల బదిలీలు జరిగాయి. ఇందులో భాగంగా, దేశ విమానయాన రంగ నియంత్రణ సంస్థ అయిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నూతన డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ అధికారి వీర్ విక్రమ్ యాదవ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. ఇప్పటివరకు డీజీసీఏ చీఫ్‌గా ఉన్న ఫైజ్ అహ్మద్ కిద్వాయ్ స్థానంలో విక్రమ్ యాదవ్ బాధ్యతలు చేపట్టనున్నారు. కిద్వాయ్‌ను సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ)కు అదనపు కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆయన 2025 జనవరిలో డీజీసీఏ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించి, ఏడాదికి పైగా సేవలు అందించారు. భారత విమానయాన రంగం వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఈ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. పెరుగుతున్న విమాన ప్రయాణికుల రద్దీ, కొత్త విమానాల కొనుగోలు, భద్రతా ప్రమాణాల పర్యవేక్షణ వంటి కీలక అంశాల్లో డీజీసీఏ పాత్ర చాలా కీలకం కానుంది. తాజాగా మరికొన్ని కీలక నియామకాలు కూడా జరిగాయి. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శిగా పునీత్ కన్సల్, సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శిగా మోనా కె. ఖందార్ నియమితులయ్యారు. అలాగే ప్రధాని పీఎంవోలో శ్రీధర్ చిరువోలును అదనపు కార్యదర్శిగా నియమించారు. వీరితో పాటు పలువురు సీనియర్ అధికారులను వివిధ మంత్రిత్వ శాఖల్లో కీలక పదవులకు బదిలీ చేశారు.

## ప్రతి పనిలో నా భర్తకు సాయం: ఉషా వాన్స్

వాషింగ్టన్: ప్రతి పనిలోనూ నా భర్తకు అండగా ఉండి సాయం చేయాలనుకుంటానని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భార్య ఉషా వాన్స్ వెల్లడించారు. ఆయనకు సాయంగా ఉండాలనుకుంటాను కాబట్టి ఆయన ప్రపంచంలో ఏం జరుగుతుందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తానని అన్నారు. తన భర్త దేనిపై దృష్టి పెట్టాడు, ఏం చేయాలనుకుంటున్నాడో తెలుసుకునే ప్రయత్నం చేస్తానని అన్నారు. తమది వివాహ బంధం కాబట్టి ఆయనకు సాయంగా ఉండాలని అన్నారు. ఆయన ఏం చేస్తున్నారో నాకు తెలియకపోతే సాయం చేయడం ఎలా సాధ్యమవుతుందని అన్నారు. అందుకే ఆయన చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకునే ప్రయత్నం చేస్తానని తెలిపారు. నచ్చని విషయంలో భర్తతో తాను అస్సలు ఏకీభవించనని స్పష్టం చేశారు. ఒక్కోసారి ఆ నిర్ణయాలు కూడా విశాల దృక్పథంతో ఆలోచించేలా చేస్తాయని అన్నారు. ఈ మేరకు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. జేడీ వాన్స్‌కు తాను ఒక నమ్మకమైన సలహాదారుగా వ్యవహరిస్తానని అన్నారు. వ్యక్తిగత విషయాల్లో తన భర్త తన అభిప్రాయాన్ని తప్పకుండా తీసుకుంటారని చెప్పారు. తన భర్త చుట్టూ ఎంతోమంది సలహాదారులు, సిబ్బంది ఉన్నారని, వారంతా ఇబ్బందిపెట్టే అంశాలు, వ్యక్తిగత విషయాలు పంచుకోవడానికి తవ వద్దకే వస్తారని ఆమె తెలిపారు. అయితే తాను సహోద్యోగిని కాదని, అనవసర విషయాల్లో మాత్రం జోక్యం చేసుకోనని స్పష్టం చేశారు. తామిద్దరి మధ్య ఒకేరకమైన అభిప్రాయం ఉండవలసిన అవసరం లేదని అన్నారు. ఏదీ దాచుకోకుండా స్వేచ్ఛాయుతంగా ఎవరి అభిప్రాయాలను వాళ్లు పంచుకుంటామని అన్నారు.

## నేటి నుంచి టోల్ ప్లాజాల వద్ద డిజిటల్ చెల్లింపులే

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ఇది ఒక ముఖ్యమైన అప్‌డేట్. బుధవారం (ఏప్రిల్ 1వ తేదీ) నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేయనున్నట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. ఇకపై టోల్ రుసుములను ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ పద్ధతుల్లో మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు దేశంలోని అన్ని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై కొత్త నిబంధన అమల్లోకి రానుంది. రహదారుల వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. టోల్ ప్లాజాల



వద్ద వాహనాల రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేయాలనే లక్ష్యంతో నగదు రహిత విధానాన్ని అమలు చేస్తున్నారు. టోల్ వసూళ్లలో పారదర్శకతను పెంచడంతో పాటు వాహనాలు టోల్ గేట్ల వద్ద ఆగకుండా వేగంగా వెళ్లేందుకు ఇది దోహదపడుతుంది. దీనివల్ల ఇంధన వినియోగం తగ్గి, కాలుష్యం కూడా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ మార్పు వల్ల డిజిటల్ చెల్లింపులకు సిద్ధంగా లేని కొంతమంది ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. సరైన ఫాస్టాగ్ లేని లేదా అందులో తగినంత బ్యాలెన్స్ లేని వాహనాలకు జరిమానా విధించవచ్చు. కొన్ని సందర్భాల్లో అటువంటి వాహనాలను టోల్ ప్లాజా వద్ద నిలిపివేసే అవకాశం కూడా ఉంది. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేశారు. ఒకవేళ ఫాస్టాగ్‌లో సమస్య ఉంటే, టోల్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉండే క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి యూపీఐ ద్వారా తక్షణమే చెల్లింపులు చేయవచ్చు. అయితే, కొన్నిసార్లు నెట్‌వర్క్ సమస్యల కారణంగా ఈ లావాదేవీలు ఆలస్యం కావచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందే ఫాస్టాగ్ గా యాక్టివ్‌గా ఉంచుకోవడం, దానిలో తగినంత బ్యాలెన్స్ ఉంచుకోవడం చేయాలని ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. ఫాస్టాగ్‌ను తమ బ్యాంకు ఖాతాతో సరిగ్గా లింక్ చేసుకోవడం కూడా ముఖ్యం.

# నెలకు 31 జీబీల డేటా!

### భారత్‌లో సగటు మొబైల్ డేటా వినియోగం

### నోకియా నివేదికలో కీలక విషయాలు

న్యూఢిల్లీ: భారతీయుల మొబైల్ డేటా వినియోగం అంచనాలకు మించి దూసుకుపోతోంది. 2025 నాటికి దేశంలో ఒక్కో వినియోగదారుడి సగటు నెలవారీ డేటా వాడకం 31 జీబీ దాటింది. గత ఐదేళ్లలో ఇది ఏటా సగటున 18 శాతం చొప్పున వృద్ధి చెందింది. ప్రముఖ టెలికాం పరికరాల తయారీ సంస్థ నోకియా మంగళవారం విడుదల చేసిన 'మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండెక్స్' నివేదికలో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దేశంలో 5జీ సేవలు వేగంగా విస్తరించడం, 4కే వీడియో స్ట్రీమింగ్, క్లౌడ్ గేమింగ్, ఏఐ ఆధారిత యాప్‌ల వాడకం పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని నివేదిక స్పష్టం చేసింది. 2025 నాటికి భారతదేశంలో మొత్తం మొబైల్ డేటా ట్రాఫిక్ నెలకు 27 ఎక్సాబైట్లు దాటింది. ఇందులో దాదాపు 47 శాతం వాటా ఒక్క 5జీదే కావడం గమనార్హం. 5జీ డేటా ట్రాఫిక్ ఏకంగా 70 శాతం వృద్ధితో నెలకు 12.9 ఎక్సాబైట్లకు చేరుకుంది. ప్రస్తుతం మెట్రో నగరాలు 5జీ వినియోగంలో ముందున్నాయి. ఈ నగరాల్లోని మొత్తం మొబైల్ డేటా ట్రాఫిక్‌లో 58 శాతం 5జీ ద్వారానే జరుగుతోంది. అయితే, క్రమంగా చిన్న పట్టణాలకు, ఇతర సర్కిళ్లకు కూడా 5జీ వేగంగా విస్తరిస్తోందని, ఇది కేవలం పట్టణాలకే పరిమితం కాలేదని నివేదిక పేర్కొంది. ఈ మార్పులో దేశంలోని స్మార్ట్‌ఫోన్ల లభ్యత కూడా కీలక పాత్ర పోషిస్తోంది. 2025 నాటికి దేశంలో 89.2 కోట్ల 4జీ డివైజ్‌లు యాక్టివ్‌గా ఉండగా, వాటిలో 38.3 కోట్లకు పైగా ఫోన్లు 5జీకి సపోర్ట్ చేసేవే. అంతేకాకుండా, గతేడాది మార్కెట్లోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్లలో 90 శాతానికి పైగా 5జీకి మద్దతిచ్చేవి కావడంతో వినియోగదారులు సులభంగా కొత్త టెక్నాలజీకి మారుతున్నారు.



## మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

### అమెరికా సాయం చేయదు.. మిత్రదేశాలపై డొనాల్డ్ ట్రంప్ ఫైర్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రదేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై సైనిక చర్యలో అమెరికాకు సహకరించని దేశాలు, తమకు కావాల్సిన చమురును తామే తెచ్చుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ పెట్టారు. 'ఇరాన్‌ను దెబ్బతీసే చర్యల్లో పాల్గొనడానికి నిరాకరించిన యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలకు నాదొక సూచన. మీకు రెండు మార్గాలున్నాయి. ఒకటి, మా దగ్గర పుష్కలంగా ఉన్న చమురును కొనుగోలు చేయండి. రెండు, కాస్త ధైర్యం తెచ్చుకుని హార్మూజ్ జలసంధికి వెళ్లి, మీకు కావాల్సిన చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేగాక మిత్రదేశాలు ఇకపై తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. "అమెరికా మీకు సాయం చేయడానికి రాదు. మాకు అవసరమైనప్పుడు మీరు ఎలాగైతే దూరంగా ఉన్నారో, మేమూ అలాగే ఉంటాం. ఇరాన్‌ను మేము ఇప్పటికే దెబ్బతీశాం. కష్టమైన పని పూర్తయింది.

లయ్యారి చిత్రం






## అవకాశాల కోసం లొంగిపోతున్నారు

టాలీవుడ్ ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సత్యకృష్ణ, తాజాగా క్యాస్టింగ్ కౌచ్ అంశంపై చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. బొమ్మరిల్లు, దేవదాస్, వినాయకుడు, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ వంటి సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించిన ఆమె, పరిశ్రమలో ఉన్న చీకటి కోణాల గురించి తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. సాధారణంగా సినిమా ఇండస్ట్రీలోనే క్యాస్టింగ్ కౌచ్ ఎక్కువగా ఉంటుందనే విమర్శలపై సత్యకృష్ణ స్పందిస్తూ.. 'కేవలం సినిమా రంగమే కాదు, ప్రతి రంగంలోనూ ఈ సమస్య ఉంది. కాకపోతే మా రంగంలో ఉన్నవారు ధైర్యంగా బయటకు వచ్చి చెబుతున్నారు కాబట్టి అందరికీ విషయాలు తెలుస్తున్నాయి. అందమైన మహిళల పట్ల అవతలి వ్యక్తులకు ఆకర్షణ కలగడం అనేది సహజమైన విషయం. కానీ, ఎవరైనా తన పరిమితులు దాటుతున్నప్పుడు వెంటనే నో అని చెప్పగలిగే ధైర్యం మహిళలకు ఉండాలి' అని ఆమె అన్నారు.

## ఎవరేమనుకున్నా పట్టించుకోను



పింక్ ఎలిఫెంట్ బ్యానర్‌పై విభిన్నమైన సినిమాలు నిర్మిస్తూ అభిరుచి గల నిర్మాతగా మంచి పేరు తెచ్చుకున్నారు కొణిదెల నిహారిక. నటకు ఫుల్ స్టాప్ పెట్టి ప్రొడ్యూసర్‌గా వరుస సినిమాలని నిర్మిస్తున్నారు. రీసెంట్‌గా -కమిటీ కుర్రోళ్లు-తో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న నిహారిక ప్రస్తుతం సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా -రాకాస- చిత్రాన్ని నిర్మించింది. కామెడీ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ మూవీ ఏప్రిల్ 3న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా ఓ మీడియాతో ముచ్చటిస్తూ ఆసక్తికర విషయాల్ని వెల్లడించింది. తాను నిర్మించే సినిమాలపై కొందరు విమర్శలు చేస్తూనే ఉంటారని, అందుకే తాను అలాంటి వారిని పట్టించుకోవడం మానేసినట్టు తెలిపింది. అయితే ఎవరు ఎన్ని రకాలుగా విమర్శలు చేసినా తాను చేసేది మాత్రం చేస్తూనే ఉంటానని చెప్పుకొచ్చింది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తనపై వచ్చే విమర్శలపై తనస్టైల్లో స్పందించిన నిహారిక ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాత్రం మాస్ కా దాస్ విశ్వక్‌సేన్‌తో చేసిన షార్ట్ ఫిలిం గురించి వెల్లడించి షాక్ ఇచ్చింది. విశ్వక్‌సేన్ హీరోగా పరిచయం కావడానికి ముందు ఆర్టిస్ట్ కావాలని చాలా రకాలుగా ప్రయత్నాలు చేశాడు. జగపతిబాబు హీరోగా జొన్నలగడ్డ శ్రీనివాస్ డైరెక్ట్ చేసిన -బంగారు బాబు-లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించిన విశ్వక్ సేన్ వెళ్లిపోమాకే మూవీతో హీరోగా అరంగేట్రం చేశాడు. అత్యంత తక్కువ బడ్జెట్‌లో నిర్మించిన ఈ మూవీని రిలీజ్ చేయడం కోసం అనేక రకాలుగా ప్రయత్నించి చివరికి దిల్ రాజు ద్వారా రిలీజ్ చేయాల్సి వచ్చింది. అయితే ఈ సినిమాకు ముందు విశ్వక్‌సేన్ ఓ షార్ట్ ఫిల్మ్‌లో నటించాడు. ఇందులో ఫిమేల్ లీడ్‌గా నిహారిక నటించింది. షూటింగ్ మొదలైంది. ఒక పాట కూడా షూట్ చేశారు.

## నెరిసిన జుట్టుతో మనీషా



55 ఏళ్ల వయసులో ఉన్న మనీషా కొయిరాలా.. వయసు అనేది కేవలం అంకె మాత్రమేనని.. మనలోని ప్రశాంతతే అసలైన అందమని బలంగా నమ్ముతున్నారు. జుట్టుకు రంగులు వేసి నిరంతరం యవ్వనంగా కనిపించాలనే ఒత్తిడి నుంచి బయటపడటం ఎంతో హాయిగా ఉందని మనీషా పేర్కొన్నారు. తన కెరీర్‌లో దాదాపు 90 చిత్రాల్లో నటించిన ఈ వెటరన్ బ్యూటీ.. ఇప్పుడు కృత్రిమ అందం కంటే ఆత్మవిశ్వాసంతో కూడిన అసలైన రూపానికే పెద్దపీట వేస్తున్నారు. అయితే తమ ఆరాధ్య దేవతను ఇలాంటి లుక్‌లో చూడటం కొందరు వీరాభిమానులకు కష్టంగా అనిపిస్తోంది. 90లలో -క్రిమినల్- సినిమాలో తన అందంతో మతులు చెడగొట్టిన బ్యూటీయేనా ఈమె? -ఆవిడా మా ఆవిడే-లో మెరిసిన సుందరి ఈవిడేనా? అంటూ నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరైతే -ఒకే ఒక్కడు' సినిమాలో విలేజ్ కుట్టీగా అలరించిన మనీషానేనా ఇలా మారిపోయింది.

## మలయాళంలోకి అనుష్క.. 'కథనార్' ట్రైలర్ రిలీజ్

'బాహుబలి' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న స్వీటీ అనుష్క శెట్టి, ఇప్పుడు మలయాళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. జయసూర్య హీరోగా నటిస్తున్న ఫాంటసీ థ్రిల్లర్ 'కథనార్' చిత్రంతో ఆమె మాలీవుడ్ ప్రేక్షకులను పలకరించబోతున్నారు. తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నప్పటికీ, తెలుగు ప్రేక్షకులకు మాత్రం కొన్ని సందేహాలను మిగిల్చింది. అనుష్క 50వ సినిమా కావడంతో ఫ్యాన్స్ ఈ ప్రాజెక్ట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దాదాపు రెండేళ్ల గ్యాప్ తర్వాత అనుష్క వెండితెరపై కనిపించబోతుండటంతో 'కథనార్' ట్రైలర్ కోసం అందరూ ఎదురుచూశారు. అయితే, చిత్ర యూనిట్ విడుదల చేసిన ట్రైలర్‌లో అనుష్క కేవలం రెండు మూడు షాట్స్‌కే పరిమితం కావడం అభిమానులను కొంచెం నిరాశకు గురిచేసింది. విజువల్స్ పరంగా సినిమా చాలా రిచ్‌గా కనిపిస్తోంది. హారర్, ఫాంటసీ ఎలిమెంట్స్‌తో కూడిన మేకింగ్ హాలీవుడ్ స్థాయిలో ఉంది. అనుష్క లుక్స్ బాగున్నప్పటికీ, ఆమె పాత్ర నిడివి ఎంతవరకు ఉంటుందోననే ఇండస్ట్రీలో చర్చ మొదలైంది. అనుష్క శెట్టికి ఇది 50వ చిత్రం కావడం విశేషం. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో ఫర్వాలేదనిపించినా, గతేడాది వచ్చిన 'ఘాటీ' డిజాస్టర్‌గా మిగిలింది. దీంతో ఈ మలయాళ చిత్రం ఆమెకు చాలా కీలకంగా మారింది. జయసూర్యతో పాటు ప్రభుదేవా, వినీత్ వంటి పేరున్న నటులు ఉండటం ఈ సినిమాకు ప్లస్ పాయింట్.






## నన్ను కాపాడండి

గ్లామర్‌తోనే కాకుండా తన నటనతోనూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసే ఆండ్రియా జెర్మియా ఇప్పుడు ఒక గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒక నటిగా తన వంతు కష్టపడి షూటింగ్ పూర్తి చేసినప్పటికీ, ఆమె నటించిన రెండు క్రేజీ ప్రాజెక్టులు పిశాచి-2, మానుషి విడుదల నోచుకోలేదు. తాజాగా, ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఆండ్రియా, తన సినిమాల విడుదల గురించి వస్తున్న ప్రశ్నలకు చాలా ఎమోషనల్‌గా సమాధానమిచ్చారు. 'ఆ రెండు చిత్రాల కోసం మీలాగే నేను కూడా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. కానీ అవి ఎప్పుడు థియేటర్లలోకి వస్తాయో నాకే తెలియదు. షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ చిత్రాలకు నిర్మాత పరమైన సమస్యలు అడ్డుగా మారాయి. ఎవరో ఒకరు పెద్ద మనసు చేసుకుని ముందుకు వచ్చి, ఆ సినిమాలను ఆర్థిక ఇబ్బందుల నుంచి ఆదుకోవాలి. ఎంతో కష్టపడి చేసినా ఫలితం దక్కడం లేదు. అదే నాకు బాధగా ఉంది' అని చెప్పుకొచ్చింది. ఒక నటిగా తన వంతు పని పూర్తి చేశానని, ఇప్పుడు అంతా నిర్మాతలు, బయ్యర్ల చేతుల్లోనే ఉందని ఆమె స్పష్టం చేశారు.

## నేడు గాయపడ్డ సింహం ఫస్ట్ సాంగ్ రిలీజ్

టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్, నటుడు తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'గాయపడ్డ సింహం'. విలక్షణమైన కథాంశంతో దర్శకుడు కశ్యప్ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో తరుణ్ భాస్కర్ సరసన 'జాతి రత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి కాంబినేషన్ అనౌన్స్ చేసినప్పటి నుండే మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కథాంశం చాలా ఆసక్తికరంగా ఉండబోతోందని సమాచారం. ప్రస్తుత యువత ఎదుర్కొంటున్న అమెరికా వీసా కష్టాలు, ఆ క్రమంలో తలెత్తే సమస్యలు, యువతలో వచ్చే ఆగ్రహం వంటి అంశాలతో ఒక పక్కా క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా దీనిని రూపొందిస్తున్నారు. సమాజంలోని సీరియస్ సమస్యను కామెడీ జోడించి చెప్పబోతుండటం విశేషం. ప్రస్తుతం షూటింగ్ పనులు శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సమ్మర్ కానుకగా మే 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది.




## సల్మాన్ సరసన నయన్!





బాలీవుడ్ భాయ్‌జాన్ సల్మాన్ ఖాన్, తెలుగు దర్శకుడు వంశీ పైడిపల్లి కలయికలో రాబోతున్న క్రేజీ ప్రాజెక్ట్ ఇప్పుడు సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. దిల్ రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై 63వ సినిమాగా దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. నిన్ననే ఈ ప్రాజెక్ట్ గురించి అధికారిక ప్రకటన రాగా, అప్పుడే ఈ సినిమాకు సంబంధించిన మరో భారీ అప్‌డేట్‌ను చిత్ర యూనిట్ బయటపెట్టింది. ఈ క్రేజీ యాక్షన్ డ్రామాలో హీరోయిన్ ఎవరనే సస్పెన్స్‌కు మేకర్స్ తెరదించారు. ఈ సినిమాలో సల్మాన్ సరసన లేడీ సూపర్ స్టార్ నయనతార నటించబోతున్నారు. నయనతార ఇప్పటికే షారుఖ్ ఖాన్ 'జవాన్' సినిమాతో బాలీవుడ్ ఆడియన్స్‌కు బాగా దగ్గరయ్యారు. ఇప్పుడు సల్మాన్ ఖాన్‌తో నటిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్ రేంజ్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లింది. వంశీ పైడిపల్లి తన సినిమాల్లో హీరోయిన్ల పాత్రలను చాలా హుందాగా, పవర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తారనే పేరుంది. అందుకే నయనతార లాంటి టాలెంటెడ్ నటి ఈ ప్రాజెక్టులోకి రావడం సినిమాకు పెద్ద బలం కానుంది.

# ఫఖర్ జమాన్ బాల్ ట్యాంపరింగ్

## 2 మ్యాచ్‌ల నిషేధం: పీసీబీ



పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో లాహోర్ ఖలందర్స్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఓపెనర్ ఫఖర్ జమాన్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం పడింది. బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడినట్టు తేలడంతో పీఎస్ఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియంలో ఈ నెల 29న కరాచీ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. కరాచీ ఇన్నింగ్స్ చివరి ఓవర్లలో ఫఖర్ జమాన్ బంతి ఆకారాన్ని మార్చేందుకు ప్రయత్నించినట్టు ఆన్-ఫీల్డ్ అంపైర్లు గుర్తించారు. దీంతో వెంటనే లాహోర్ ఖలందర్స్ జట్టుకు 5 పరుగుల పెనాల్టీ విధించి, బంతిని మార్చారు. ఈ ఘటనపై ఆన్-ఫీల్డ్ అంపైర్లు షాహిద్ సైకత్, ఫైసల్ ఖాన్ అఫ్రీదీ, టీవీ అంపైర్ ఆసిఫ్ యాకూబ్, నాలుగో అంపైర్ తారిఖ్ రషీద్‌లు మ్యాచ్ రిఫరీకి ఫిర్యాదు చేశారు. పీఎస్ఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.14 ప్రకారం బంతి ఆకారాన్ని మార్చడం లెవల్ 3 నేరంగా పరిగణిస్తారు. అయితే, ఫఖర్ జమాన్ తనపై వచ్చిన ఆరోపణలను అంగీకరించకుండా, విచారణను కోరాడు. దీంతో మ్యాచ్ రిఫరీ రోషన్ మహానామా ఆధ్వర్యంలో అధికారిక విచారణ జరిగింది. ఈ విచారణకు ఫఖర్ జమాన్‌తో పాటు లాహోర్ ఖలందర్స్ కెప్టెన్ షహీన్ అఫ్రిది, జట్టు డైరెక్టర్ సమీన్ రాణా, మేనేజర్ ఫరూఖ్ అన్వర్ హాజరయ్యారు. ఫఖర్ వాదనలను విన్నప్పటికీ, అందుబాటులో ఉన్న సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత అతన్ని దోషిగా నిర్ధారించిన మ్యాచ్ రిఫరీ, రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని ఖరారు చేశారు. ఈ నిషేధం కారణంగా ఫఖర్ జమాన్.. ఏప్రిల్ 3న ముల్తాన్ సుల్తాన్స్‌తో గడ్డాఫీ స్టేడియంలో, ఏప్రిల్ 9న కరాచీలోని నేషనల్ బ్యాంక్ స్టేడియంలో ఇస్లామాబాద్ యునైటెడ్‌తో జరిగే కీలక మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. ఈ స్టార్ ఓపెనర్ సేవలను కోల్పోవడం లాహోర్ జట్టుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ధోనీతో మాట్లాడట్లేదు



చెన్నై సూపర్ కింగ్స్ నుంచి వెళ్లిపోయిన తర్వాత మహేంద్ర సింగ్ ధోనీతో మాట్లాడలేదని రాజస్థాన్ రాయల్స్ ఆటగాడు రవీంద్ర జడేజా తెలిపాడు. ధోనీ ఫోన్ స్విచ్చాఫ్ చేసి ఉంచుతాడని, అందుకే తాను మాట్లాడలేకపోయానని తెలిపాడు. ఐపీఎల్-19లో భాగంగా నిన్న జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ చేతిలో చెన్నై చిత్తయింది. జడేజా రెండు వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం.. జడేజా మాట్లాడుతూ, 13 సంవత్సరాల పాటు చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన తాను, ఈసారి అదే జట్టుకు వ్యతిరేకంగా మైదానంలోకి దిగడం కాస్త వింతగా అనిపించిందని అన్నాడు. తాను, ధోనీ కలిసినప్పుడు అన్ని విషయాలపై మాట్లాడుకుంటామని తెలిపాడు.

## పసుపు రంగు పాతదైపోయింది

'రాజస్థాన్ పింక్ కలర్ నచ్చింది. పసుపు రంగు కొంచెం పాతదైపోయిందనిపిస్తోంది. అయితే, ఇది నేను సరదాగా అంటున్న మాట. నిజానికి 12-13 ఏళ్లు ఆడిన సీఎస్‌కే లాంటి ఫ్రాంచైజీని వీడటం మొదట్లో చాలా కష్టంగా, భావోద్వేగంగా అనిపించింది. కానీ, ప్రయాణంలో ఇలాంటి మార్పులు కూడా భాగమేనని నాకు నేను సర్దిచెప్పుకున్నాను. నా ఐపీఎల్ కెరీర్‌లో తొలి టైటిల్ గెలిచిన జట్టులోకి మళ్లీ రావడం సంతోషంగా ఉంది' అని జడేజా తెలిపాడు. 'అండర్-19 ప్రపంచకప్ తర్వాత నా ఐపీఎల్ ప్రస్థానం రాజస్థాన్‌తోనే మొదలైంది. తొలి సీజన్‌లోనే టైటిల్ గెలిచాం. ఆ జ్ఞాపకాలు నాతో ఎప్పుడూ ఉంటాయి. ఇప్పుడు అవే సానుకూల దృక్పథంతో కొత్త జట్టులో చేరాను. నా అనుభవాన్ని జట్టుతో పంచుకుంటూ, కొత్త విషయాలు నేర్చుకోవడమే నా లక్ష్యం' అని వివరించాడు.

# రాజకీయ పోస్టులు పెడితే కోటి ఫైన్

## పాక్ క్రికెటర్లకు కొత్త రూల్

పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ నసీం షాకు ఆ దేశ క్రికెట్ బోర్డు (పీసీబీ) భారీ జరిమానా విధించింది. పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్‌పై సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్ట్ చేసినందుకు గానూ అతడికి 72,000 అమెరికన్ డాలర్లు (పాకిస్థాన్ కరెన్సీలో సుమారు రూ. 2 కోట్లు) ఫైన్ వేసింది. ఈ ఘటన నేపథ్యంలో, కేంద్ర కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లందరికీ పీసీబీ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇకపై రాజకీయపరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే... ఇటీవల పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 ప్రారంభ మ్యాచ్‌కు పంజాబ్ సీఎం మరియం నవాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె, ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్ కు కూతురు వరుస అవుతుంది. అయితే, నసీం షా సోషల్ మీడియాలో "గడాఫీ స్టేడియంలో ఆమెకు రాణికి ఇచ్చినంత గౌరవం ఎందుకు ఇస్తున్నారు?" అని వ్యంగ్యంగా పోస్ట్ చేశాడు. గల్ఫ్ యుద్ధం కారణంగా దేశంలో నెలకొన్న సంక్షోభం దృష్ట్యా ప్రభుత్వ పొదుపు చర్యల్లో భాగంగా అభిమానులను స్టేడియాల్లోకి అనుమతించని సమయంలో ఒక రాజకీయ నాయకురాలికి ఇంతటి ప్రాధాన్యత ఇవ్వడంపై ఈ పోస్ట్ దుమారం రేపింది. ఈ పోస్ట్‌ను వెంటనే తొలగించి, తన ఖాతా హ్యాక్ అయిందని నసీం షా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశాడు. అయితే, ఈ వాదనను పీసీబీ అంగీకరించలేదు. ఈ నెల 27న అతడికి షోకాజ్ నోటీసు జారీ చేసి, విచారణ చేపట్టింది. క్రమశిక్షణ కమిటీ విచారణ అనంతరం సెంట్రల్ కాంట్రాక్ట్ నిబంధనలను, సోషల్ మీడియా మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు తేల్చి రూ. 2 కోట్ల జరిమానా విధించింది. నసీం షా బేషరతుగా క్షమాపణ చెప్పినట్లు బోర్డు తెలిపింది. ఈ ఘటనకు బాధ్యుడిగా అతడి సోషల్ మీడియా సలహాదారుడిని కూడా విధుల నుంచి తొలగించి, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది.

# బీసీసీఐ నిర్ణయం సరైనదే: గంగూలీ

భారత్-ఆస్ట్రేలియా మధ్య జరగనున్న ప్రతిష్ఠాత్మక టెస్టు సిరీస్ (బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీ) వేదికల ఎంపికపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చపై టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ స్పందించారు. ఈడెన్ గార్డెన్స్‌లో టెస్టు మ్యాచ్ జరగకపోవడం పట్ల బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనకు కొంత నిరాశ ఉన్నప్పటికీ, బోర్డు తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఆయన అభిప్రాయపడ్డారు. "ఒక మాజీ క్రికెటర్‌గా కోల్‌కతాలో మ్యాచ్ జరగాలని నేను కోరుకుంటాను. కానీ, కేవలం సంప్రదాయ



వేదికలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ఇతర మైదానాలకూ అవకాశం ఇవ్వడం ముఖ్యం" అని గంగూలీ అన్నారు. గువాహటి, రాంచీ వంటి నగరాల్లో టెస్టులు నిర్వహించడం వల్ల అక్కడి అభిమానులకు మేలు జరుగుతుందని, ప్రస్తుతం దేశంలోని అన్ని స్టేడియాల్లోనూ ప్రపంచ స్థాయి సదుపాయాలు ఉన్నాయని ఆయన చెప్పారు. 2001లో ఈడెన్ గార్డెన్స్‌లో ఆస్ట్రేలియాపై సాధించిన చారిత్రక విజయాన్ని గుర్తుచేసుకున్న దాదా, ఆనాటి ఆటగాళ్లంతా మళ్లీ ఒక చోట చేరాలని ప్లాన్ చేస్తున్నట్లు వెల్లడించారు. "మేమంతా ఈ నెలలోనే కలవాల్సి ఉంది. అయితే సచిన్ టెండూల్కర్ కుమారుడి (అర్జున్ టెండూల్కర్) వివాహం ఉండటంతో ఆ భేటీని వాయిదా వేశాం. త్వరలోనే ఆ వేడుక ఎప్పుడనేది ప్రకటిస్తాం" అని ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తన కెరీర్‌లో లార్డ్స్ బాల్కనీలో చొక్కా విప్పిన నాట్‌వెస్ట్ ట్రోఫీ విజయం కంటే.. కోల్‌కతా, అడిలైడ్, హెడింగ్లేలలో సాధించిన టెస్టు విజయాలే తనకు ఎక్కువ సంతృప్తినిస్తాయని గంగూలీ చెప్పారు.





# గుజరాత్‌పై పంజాబ్ విన్

## కూపర్ కనోలీ సూపర్ షో

**ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ అదిరిపోయే బోణీ కొట్టింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 3 వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విజయాన్ని అందుకుంది. 163 పరుగుల లక్ష్య ఛేదనలో పంజాబ్ మిడిల్ ఆర్డర్ కుప్పకూలినా, యువ ఆటగాడు కూపర్ కనోలీ (44 బంతుల్లో 72 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఒంటిచేత్తో జట్టును గెలిపించాడు.**




కీలక సమయంలో జేవియర్ బార్ట్‌లెట్ (5 బంతుల్లో 11 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో మరో 5 బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్‌ను కట్టడి చేసింది. శుభ్‌మన్ గిల్ (39), జోస్ బట్లర్ (38) రాణించడంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. పంజాబ్ బౌలర్లలో విజయ్‌కుమార్ వైశ్యాఖ్ 3 వికెట్లతో సత్తా చాటగా, యజువేంద్ర చాహల్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన పంజాబ్‌కు ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (24 బంతుల్లో 37; 4 సిక్సర్లు) మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే అతను ఔటయ్యాక పంజాబ్ ఇన్నింగ్స్ ఒక్కసారిగా తడబడింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (18) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. 118 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పంజాబ్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులో పాతుకుపోయిన కూపర్ కనోలీ, గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా సంయమనంతో ఆడుతూనే, వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు, సిక్సర్లు బాదుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. ఆఖరి ఓవర్లలో మ్యాచ్ తీవ్ర ఉత్కంఠను రేపింది. చివర్లో మార్కో యాన్సెన్ (9) ఔటవ్వడంతో పంజాబ్ శిబిరంలో ఆందోళన మొదలైంది. అయితే కనోలీకి జత కలిసిన బార్ట్‌లెట్ ఒక సిక్సర్ బాది సమీకరణాన్ని సులభతరం చేశాడు. దీంతో పంజాబ్ 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఈ సీజన్‌లో తమ తొలి విజయాన్ని ఘనంగా నమోదు చేసింది. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 3 వికెట్లు తీసినా ఫలితం లేకపోయింది. కనోలీ అసాధారణ పోరాట పటిమతో పంజాబ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.



# బీజేపీలోకి టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్

భారత టెన్నిస్ దిగ్గజం, ఒలింపిక్ పతక విజేత లియాండర్ పేస్ తన రాజకీయ ప్రయాణంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. పశ్చిమ బెంగాల్‌లో 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కీలక తరుణంలో పేస్ బీజేపీలో చేరాడు. గతంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో ఉన్న పేస్, ఇప్పుడు బీజేపీ తీర్థం పుచ్చుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, పశ్చిమ బెంగాల్ బీజేపీ మాజీ అధ్యక్షుడు, కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ సమక్షంలో లీండర్ పేస్ కాషాయ కండువా కప్పుకున్నాడు. ఈ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. 1996 ఒలింపిక్స్‌లో పేస్ కాంస్య పతకం సాధించిన చారిత్రక క్షణాలను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో గాయంతో ఆడుతూ ఆండ్రీ అగస్సీ చేతిలో ఓడిపోయినప్పుడు తానెంతో బాధపడ్డానని చెప్పారు. ఒలింపిక్ పటంలో భారత్‌కు గుర్తింపు తెచ్చిన పేస్, ఇప్పుడు బీజేపీ వేదికగా దేశానికి సేవ చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన అనంతరం లియాండర్ పేస్ భావోద్వేగానికి గురయ్యాడు.



# వైభవ్‌పై ఒత్తిడి వద్దు

ఐపీఎల్ 2026లో తన అరంగేట్ర మ్యాచ్‌లోనే విధ్వంసకర ఇన్నింగ్స్‌తో సంచలనం సృష్టించిన 15 ఏళ్ల యువ కెరటం వైభవ్ సూర్యవంశీపై టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల వర్షం కురిపించాడు. అయితే, ఇంత చిన్న వయసులోనే అతడిపై అంచనాలు పెంచి, టీమిండియాలోకి తీసుకురావాలంటూ తొందరపడొద్దని కీలక సూచన చేశాడు. నిన్న గువాహటిలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడానికి వైభవ్ ఆటే కారణమైంది. ఈ మ్యాచ్‌లో తొలుత చెన్నైని 127 పరుగులకే కట్టడి చేసిన రాజస్థాన్, ఛేదనలో వైభవ్ సూర్యవంశీ మెరుపులతో ఆధిపత్యం చెలాయించింది. కేవలం 17 బంతుల్లో 52 పరుగులు చేసిన వైభవ్, అందులో 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి ఐపీఎల్ చరిత్రలోనే మూడో వేగవంతమైన అర్ధశతకాన్ని నమోదు చేశాడు. అతని ధాటికి రాజస్థాన్ పవర్‌ప్లేలోనే వికెట్ నష్టపోకుండా 74 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షం చేసింది. ఈ ప్రదర్శనపై తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన అశ్విన్, వైభవ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "అతడికి అలాంటి లక్ష్యాలు నిర్దేశించకండి. అతను ఇంకా కుర్రాడు కాదు, ఒక పిల్లాడు. ఎంఎస్ ధోనీ 44 ఏళ్ల వరకు ఆడితే, సూర్యవంశీ 40 ఏళ్ల వరకు ఆడినా.. అతనికి ఇంకా రెండున్నర దశాబ్దాల క్రికెట్ భవిష్యత్తు ఉంది. అతడిని ప్రశాంతంగా వదిలేయండి. సరైన సమయంలో తనే పైకొస్తాడు. టీమిండియాకు ఆడలేనంత స్థాయి ఆటగాడు కాదు. కచ్చితంగా ఏదో ఒక రోజు ఆడతాడు. ఎప్పుడు ఆడతాడనే దాని కోసం మనం కాస్త ఆగాలి. మనకెందుకంత తొందర?" అని అశ్విన్ ప్రశ్నించాడు. వైభవ్ బ్యాటింగ్ తీరును అశ్విన్ ఆకాశానికెత్తాడు. "అతనికి 15 ఏళ్లు నిండాయి. అందుకే 15 బంతుల్లో 50 కొట్టాడు. తన వయసును చూపిస్తున్నాడు. అతను ఎంత అద్భుతమైన ఆటగాడు? అతని బ్యాట్ స్పీడ్ ఎంత వేగంగా ఉంది? అతని దెబ్బకు చెన్నై బౌలర్ల వద్ద సమాధానమే లేదు.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 1-4-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు

సంపాదకీయం

Editorial

# అగ్రరాజ్య అహంకారం

నేటి ప్రపంచం ఒక అస్థిరమైన అగ్నిపర్వతంలా కనిపిస్తోంది. ఒకవైపు రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న భీకర పోరు, మరోవైపు ఇరాన్, వెనెజువెలా వంటి దేశాలపై అమెరికా సాగిస్తున్న దాడులు లేదా తీవ్ర ఒత్తిడి విధానాలు అంతర్జాతీయ శాంతిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఈ సంక్షోభాలన్నింటి వెనుక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆధిపత్య కాంక్ష, అమెరికా ఫస్ట్ అనే నినాదంతో సాగిస్తున్న దూకుడు రాజకీయాలే కారణం. ట్రంప్ తన మొదటి అధ్యక్ష కాలంలోనే కాకుండా, రెండవ సారి అధికారంలోకి వచ్చాక విదేశీ విధానాలు ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నాయి. ఇరాన్‌తో అణ్వాయుధ ఒప్పందం నుంచి తప్పుకోవడం మొదలుకొని, ఆ దేశంపై ఆర్థిక ఆంక్షలు విధించడం, ఇరాన్‌పై దాడి చర్యలు పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలను రాజేస్తున్నాయి. కేవలం చమురుపై నియంత్రణ సాధించడానికే ఈ దాడులన్నది ఆయన బహిరంగంగా చెప్పిన మాటలు ఆయన వ్యాపార కోణపు విదేశీ విధానానికి నిదర్శనం. లాటిన్ అమెరికాలో వెనెజువెలాపై పట్టు సాధించేందుకు నికోలస్ మదురోను బంధించడం వంటి ఆపరేషన్లు చేయడం ద్వారా, అక్కడ కూడా తన ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని ట్రంప్ ప్రయత్నించారు. ఈ చర్యలు ఆ దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలోనూ ట్రంప్ వైఖరి విచిత్రంగా ఉంది. యుద్ధాన్ని ఆపుతానని చెబుతూనే, ఉక్రెయిన్ పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం, నాటో దేశాలను రక్షణ ఖర్చుల విషయంలో బెదిరించడం ద్వారా ప్రపంచ భద్రతా వ్యవస్థను ఆయన విచ్ఛిన్నం చేస్తున్నారు. ట్రంప్ దృష్టిలో అంతర్జాతీయ సంబంధాలన్నీ కేవలం లాభనష్టాల బేరాలే. ఆయన ఆధిపత్య ధోరణి వల్ల కేవలం కొన్ని దేశాలే కాదు, మొత్తం ప్రపంచ ఇంధన సరఫరా, ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతోంది. ఏకపక్ష నిర్ణయాలతో ప్రపంచ దేశాలను తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలనే ఈ దుర్బుద్ధి శాంతి కంటే యుద్ధాలకే ఎక్కువ దారితీస్తోంది. ప్రపంచ దేశాలు సంఘటితమై ఈ అగ్రరాజ్య ఆధిపత్య పోకడలను నిలదీయకపోతే మానవాళికి పెను ప్రమాదమే.




ప్రతి మనిషికి తన జీవితములో ఒకానొక లక్ష్యము ఆస్తి సంపాదించడం. అట్టి ఆస్తి స్థిరాస్తి, చరాస్తి అని రెండు రకాలుగా ఉంటుంది. స్థిరాస్తులలో వ్యవసాయ భూములు లేదా ఇతర కమర్షియల్ భూములు, ఇళ్ళు, భవనాలు మొదలగునవి ఎన్నో రకాలుగా ఉంటాయి. వ్యవసాయ నిమిత్తము కొనుగోలు చేసే భూములు గానీ, ఏవైనా వ్యాపార లావాదేవీల నిమిత్తముతో కూడిన భూములు గాని అనగా ఫాక్టరీలుగానీ, ఇతర గోడవున్లు గానీ ఇలా భూములు ఎన్నో రకాలుగా ఉంటాయి. అలాంటి స్థిరాస్తులలో పెట్టుబడి పెడుతున్నప్పుడు చాలా జాగ్రత్తగా విజ్ఞతతో, సరైన అవగాహనతో, సరైన సలహాలతో పెట్టుబడులు పెట్టి ఖరీదు చేయడం ఎంతో ముఖ్యమైనది. ఏ మాత్రము అవగాహన లేకుండా పెట్టుబడి పెట్టినచో తర్వాత నష్టాలను భరించాల్సి ఉంటుంది. అలా నష్టపోకుండా ఉండాలి అంటే అట్టి పెట్టుబడి పెడుతున్న స్థిరాస్తి యొక్క భూమి యొక్క స్వభావము ఎలాంటిదో ముందుగా తెలుసుకోవాలి.



ఏజే కరణ్‌లాల్
అడ్వొకేట్, 92557496
advocateajkl@gmail.com

అట్టి భూమి కొనదగినదా, కొనకూడనిదా అనే విషయం ముందుగా తెలుసుకోవాలి. అలా కొన కూడని భూములలో 'ఇనామ్' భూములు ఒకటి. ఇనామ్ భూములు ఒక రకము గా సర్కారు భూములే. కాబట్టి ఇనామ్ భూములపైన పెట్టుబడి పెట్టడము మం చి పద్ధతి కాదు. అలాంటి పెట్టుబడులు నష్టాలకు దారి తీసే అవకాశం ఉంటుం ది. ఎందుకంటే ప్రభుత్వ భూములలో పెట్టుబడి పెట్టి అలాంటి భూములను కొనరాదు. ప్రభుత్వ భూములను ఎప్పుడైనా స్వాధీనము చేసుకునే అధికార ము ప్రభుత్వానికి ఉంటుంది. స్వాతం త్ర్యం రాక ముందు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చాలా మటుకు భూమి అప్పట్లో బడా బడా భూస్వాములు, జమీందారుల స్వాధీనములో పరిమితికి మించి ఉండే వి. భూస్వాములు, జమీందారులు వారి దగ్గర పని చేసిన వారికి లేదా వారికి ఇష్టమైన వ్యక్తులకు దానముగా భూమిని దానం చేసేవారు. ఇలా దానముగా ఇచ్చి న భూమిని 'ఇనామ్ భూమి' అని పిలు స్తారు. స్వాతంత్ర్యము వచ్చిన తర్వాత భారత ప్రభుత్వము, అప్పటి ఉమ్మడి ఆం ధ్రప్రదేశ్ ప్రభుత్వము భూ సంస్కరణల ను తీసుకు వచ్చింది. 1975 ఆంధ్ర ప్ర దేశ్ భూసంస్కరణల చట్టము ప్రకారము అప్పటి ప్రభుత్వము ప్రతి మనిషికి, ప్రతి కుటుంబానికి భూమి ఉండవలసిన గరిష్ట పరిమితిని విధించింది.

ఇలాంటి పరిధి భూమి స్వభావాన్ని బట్టి వివిధ రకాలుగా ఉంటుంది. పరిధిని మించిన భూమి ఉన్న వారి నుండి ప్రభుత్వము అట్టి భూమిని స్వాధీనము చేసుకుని, ప్రభుత్వము తన వద్దనే కొంత ఉంచుకుని అప్పట్లో భూమి లేని నీరు పేదలకు భూమిని పంచిపెట్టింది. ఇట్టి భూమిని 'ఇనామ్ భూమి' అన్నారు. ఇలాంటి 'ఇనామ్ భూములు' అనేవి ఎలాంటి హక్కు లేని భూములు. ఎవరికైతే ప్రభుత్వము ఇనామ్ భూములను పంచి ఇచ్చినాదో అట్టి ఇనామ్ భూములు మొత్తము ప్రభుత్వ భూములే. ఇట్టి ఇనామ్ భూములను వ్యవసాయం చేసుకునే హక్కు మాత్రమే ఇనామ్ భూములను పొందిన వారికి ఉంటుంది., ఇట్టి ఇనామ్ భూములను, ఇనామ్ భూములు పొందిన వారు వంశ పారంపర్యముగా వారి వారసులకు బదిలీ చేయవచ్చు. కానీ వారు గానీ వారి వంశ పారంపర్యమువారు గానీ అమ్ముకోవడానికి ఎలాంటి హక్కు ఉ ండదు. ఇనామ్ భూములకు పట్టాలు ఉంటాయి. కానీ అట్టి ఇనామ్ భూములు ప్రభుత్వ భూములే. కొన్ని రకములైన ఇనామ్ భూములలో పట్టా ఉన్నవారు భూమిని అమ్ముకోవచ్చు. పట్టా రాక ముందు చేసిన భూమి అమ్మకపు పత్రము (సేల్ డీడ్) చెల్లదు. 1955 లో ఇనామ్ భూముల రద్దు చట్టము వచ్చింది. ఈ చట్టము ద్వారా ఎక్కువగా భూములు ఉన్న వారి నుండి భూమిని ప్రభుత్వం స్వాధీనము చేసుకుని తక్కువ ఉన్న వారికి ఒ. ఆర్. సి. మంజూరు చేసి హక్కులను కల్పించింది. ఆంధ్ర ప్రదేశ్ లో అయితే 'రియోటవారీ' పట్టా ఇచ్చారు. తెలంగాణ ప్రాంతములో 'ఒ. ఆర్. సి.' పట్టా ఇచ్చారు. ఈ పట్టాల మీద ఆధారపడి కొందరు ఇనామ్ భూముల వ్యవసాయదారులు కొన్ని నిబంధనల మేరకు పట్టాలు పొంది హక్కులను పొందారు.

ఇలాంటి హక్కులు కలిగిన వారు కొన్ని నిబంధనల మేరకు భూములను అమ్ముకోవచ్చు. అట్టి భూములను స్వంత భూములుగా పరిగణించి అమ్ముకునే హక్కు నిబంధనల మేరకు కలిగి ఉ ంటారు. అయితే ఒక వ్యక్తి 'ఓఆర్సీ' సర్టిఫికెట్ పొందాలి అనుకుంటే 1954-55 ప్రాంతములో సదరు వ్యక్తి పేరు పైన 'ఖాసరా పహనీ'లో తన పేరు కలిగి ఉండాలి. లేదా 1973-74 పహనీలో సదరు వ్యక్తి పేరు ఉన్నట్లయితే అట్టి పహానీతో పాటుగా ప్రస్తుత సంవత్సరంలో దరఖాస్తు చేస్తున్న పహానీలో సదరు వ్యక్తి పేరు ఉన్నట్లయితే అట్టి వ్యక్తి సంబంధిత రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. అన్నీ అర్హతలను పరిగణించి సంబంధిత రెవెన్యూ అధికారులు 'ఓఆర్సీ' మంజూరు చేస్తారు., ఎవరైతే ఆంధ్ర ప్రదేశ్ లో జనవరి 7,1948 కి పూర్వము పహనీలో పేరు ఉన్నట్లయితే, సాగు చేస్తూ ఉన్నట్లయితే అట్టి ఇనామ్ దారుడు 'ఓఆర్సీ' పొందేందుకు హక్కు కలిగి ఉంటాడు. తెలంగాణ ప్రాంతములో అయితే 12 జులై,1955 నాటికి ఇనామ్ దారుడు ఆ భూమిలో కబ్జా లో ఉన్నట్లయితే అతను కూడా ఓఆర్సీ పొంది పట్టా పొందే అవకాశం కలిగి ఉంటాడు. 'ఓఆర్సీ' లేకుండా భూములను కొనుగోలు చేసిన వారి కొనుగోలు చెల్లదని 2021-22 లో తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఇనామ్ భూముల వెనక ఇంత తతంగము ఉంటుంది. కావున భూమి కొంటున్నప్పుడు అది సాధారణ వ్యవసాయ భూమా లేక ఇనామ్ భూమినా అని తెలుసుకొని ఒకవేళ ఇనామ్ భూమి అయినట్లైతే అట్టి ఇనామ్ భూమి కొనక పోవడము ఎంతో శ్రేయస్కరము. అయినప్పటికినీ సదరు భూమి కొనుగోలు చేస్తున్నప్పుడు తగిన అర్హతలు, అనుభవము ఉన్న ఒక అడ్వకేట్ ద్వారా సలహా తీసుకుని పెట్టుబడి పెట్టడం శ్రేయస్కరం.

# పరిహారం ఎందుకివ్వరు?

విమానయాన రంగం శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో, వినియోగదారుడి హక్కులు మాత్రం గాలిలో దీపంలా మారుతున్నాయి. ఇటీవల పార్లమెంటు వేదికగా ఎంపీ రాఘవ్ చద్దా లేవనెత్తిన ప్రశ్న కేవలం ఒక రాజకీయ నాయకుడి నిలదీత కాదు; ఇది విమానాశ్రయాల్లో పడిగాపులు కాస్తున్న ప్రతి సగటు ప్రయాణికుడి ఆవేదన. ఒక ప్రయాణికుడి బ్యాగులో నిర్దేశిత బరువు కంటే కొన్ని గ్రాములు అదనంగా ఉంటే, విమానయాన సంస్థలు కిలోల లెక్కన వేలకు వేలు చార్జీలు వసూలు చేస్తాయి.



ఈ విషయంలో సంస్థలది జీరో టాలరెన్స్ విధానం. కానీ, అదే విమానం గంటల తరబడి ఆలస్యమైతే? ప్రయాణికుడి అమూల్యమైన సమయం వృథా అయితే? దానికి మాత్రం సంస్థలు బాధ్యత వహించవు. సాంకేతిక కారణాలనో, వాతావరణం బాగోలేదనో చెప్పి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. గ్రాములకు చార్జీలు.. గంటలకు మాత్రం మినహాయింపు అనే విధానం ఎక్కడి న్యాయం? కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి స్పందిస్తూ.. ప్రయాణికుల రక్షణ కోసం పాసింజర్ చార్టర్, డీజీసీఏ నిబంధనలు ఉన్నాయని సమాధానమిచ్చారు. విమానం 2-4 గంటలు ఆలస్యమైతే అల్పాహారం, 6 గంటలు దాటితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వంటి నిబంధనలు కాగితాల మీదే బాగున్నాయి. ఆచరణలో మాత్రం.. అసాధారణ పరిస్థితులు అనే నిబంధనను అడ్డుపెట్టుకుని సంస్థలు పరిహారం ఎగ్గొడుతున్నాయి. ఈ లొసుగులను అరికట్టడంలో ప్రభుత్వ పర్యవేక్షణ లోపించిందనేది వాస్తవం. విదేశాల్లో విమాన ఆలస్యానికి కచ్చితమైన, భారీ పరిహారం చెల్లించే చట్టాలు ఉన్నాయి. భారత్‌లో కూడా అటువంటి కఠిన నిబంధనలు రావాలి. ప్రయాణికుడు అడగకముందే, ఆలస్యానికి తగిన పరిహారం వారి ఖాతాలో జమ అయ్యే వ్యవస్థ రావాలి. సాంకేతిక లోపం పేరుతో సంస్థలు తప్పించుకోకుండా, ఆలస్యానికి గల కారణాలపై పారదర్శకత ఉండాలి. ప్రయాణికుడి తప్పుకు జరిమానా ఉన్నప్పుడు, సంస్థ తప్పుకు కూడా అంతే స్థాయి జరిమానా ఉండాలి. విమానయానం ఇప్పుడు విలాసం కాదు, అవసరం. సామాన్యుడు కూడా విమానం ఎక్కుతున్న ఈ రోజుల్లో.. వారిని ఆదాయ వనరుగా మాత్రమే చూడటం తగదు. విమానయాన సంస్థల లాభాల కంటే.. ప్రయాణికుల హక్కులు, వారి సమయం విలువైనవి. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, తరీరీతూ మంత్రపు సమాధానాలతో సరిపెట్టకుండా, విమానయాన సంస్థలను జవాబుదారీ చేసే దిశగా కఠిన చర్యలు చేపట్టాలి.



వినోద్ కుమార్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.